తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

మెదక్ - మహబూబ్‌నగర్

సంగారెడ్డి | సిద్దిపేట | జోగులాంబ గద్వాల వనపర్తి | నారాయణపేట నాగర్ కర్నూల్

గురువారం

19 నవంబర్ 2026

Follow :

గుడుంబా తయారీ
ముడి సరుకుల పట్టివేత



- 342 కిలోల నల్ల బెల్లం, 200 కిలోల పటిక స్వాధీనం
- ఒకరి అరెస్టు.. బొలెరో వాహనం సీజ్

తెలకపల్లి, నవంబర్ 18 (జనంసాక్షి): గుడుంబా తయారీకి ఉపయోగించే ముడిసరుకులను అక్రమంగా తరలిస్తున్న వాహనంపై ఎక్సైజ్ స్టేట్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) అధికారులు దాడి చేసి భారీగా నల్ల బెల్లం, పటికతో పాటు గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఒకరిని అరెస్టు చేసి, సరుకు తరలిస్తున్న బొలెరో వాహనాన్ని సీజ్ చేశారు.

మండల కేంద్ర శివారులోని కల్వకుర్తి రోడ్డులో వైకుంఠ ధామం సమీపంలో బుధవారం సాయంత్రం ఎస్‌టీఎఫ్ అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ విష్ణుమూర్తి పర్యవేక్షణలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్. రమేష్ తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు.

ఈ క్రమంలో అనుమానాస్పదంగా వస్తున్న మహీంద్రా బొలెరో మ్యాక్సీ ట్రక్ (టీస్ 08UD2111)ను ఆపి తనిఖీ చేయగా అక్రమంగా తరలిస్తున్న సరుకు బయటపడింది. వాహనంలో 342 కిలోల నల్ల బెల్లం, 200 కిలోల పటిక, 10 లీటర్ల గుడుంబాను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

వాహనాన్ని నడుపుతున్న ఉప్పల నవీన్ (37) జీలుగుపల్లె గ్రామం, లింగాల మండలానికి చెందిన వ్యక్తిగా గుర్తించి అరెస్టు చేశారు. గుర్తుతెలియని వ్యక్తుల వద్ద సరుకును కొనుగోలు చేసి స్థానికంగా గుడుంబా తయారీదారులకు, వినియోగదారులకు విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు అధికారులు తెలిపారు. అనంతరం నిందితుడిని అరెస్టు చేసి, స్వాధీనం చేసుకున్న సరుకుతో పాటు వాహనాన్ని తదుపరి చర్యల నిమిత్తం తెలకపల్లి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ అధికారులకు అప్పగించారు. అక్రమంగా గుడుంబా తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్. రమేష్, ఎక్సైజ్ కానిస్టేబుళ్లు బి. రవి, జె. సతీష్, జి. రాహుల్ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు శిక్షలు.. భారీ జరిమానాలు

- మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై చర్యలు!
- హెల్మెట్ లేకుంటే జరిమానా తప్పదు!
- జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు



మెదక్ బ్యూరో నవంబర్ 18 (జనంసాక్షి): రోడ్డు ప్రమాదాల నివారణ, వాహనదారుల ప్రాణ రక్షణే లక్ష్యంగా జిల్లాలో ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, మైనర్లకు వాహనాలు ఇచ్చినట్లయితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా 2026 జనవరి నుంచి ఇప్పటివరకు మైనర్లు వాహనాలు నడిపిన ఘటనల్లో 87 కేసులు నమోదు చేసి రూ.42,500 జరిమానా విధించినట్లు వెల్లడించారు. అదేవిధంగా హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపిన వారిపై 92,639 చలాన్లు నమోదు చేసి రూ.1,61,88,800 జరిమానా విధించినట్లు తెలిపారు.

మిగతా 10లో..

పట్టభద్రుల ఓటరు నమోదు దరఖాస్తుల పరిశీలన గడువులోగా పూర్తి చేస్తాం

- జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్ 18 (జనంసాక్షి): హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కోసం అందిన దరఖాస్తుల పరిశీలనను నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఖుష్బూ గుప్తా తెలిపారు.

బుధవారం న్యూఢిల్లీ నుంచి భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ భాను ప్రకాశ్ యేటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఖుష్బూ గుప్తా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఓటరు జాబితా పునఃరూపకల్పన (డీ-నోవో) ప్రక్రియలో భాగంగా చేపట్టిన చర్యలు, దరఖాస్తుల పరిశీలన పురోగతిని వివరించారు.

డిప్యూటీ ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ ఓటరు జాబితా రూపకల్పనలో పారదర్శకత, కచ్చితత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.



కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ జిల్లాలో ఫారం-18 ద్వారా పట్టభద్రుల ఓటరు నమోదుకు ఇప్పటివరకు మొత్తం 45,477 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. గతంతో పోలిస్తే ఈసారి సుమారు 10 వేల దరఖాస్తులు అదనంగా వచ్చాయని వెల్లడించారు. అందిన దరఖాస్తులను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వీటిలో సుమారు 1,600 దరఖాస్తులు క్షేత్రస్థాయి విచారణ కోసం పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని మరో రెండు రోజుల్లోగా పరిష్కరించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ నవంబర్ 20వ తేదీలోగా పూర్తి చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. దరఖాస్తుల పరిశీలనలో నాణ్యతతో పాటు గడువుకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.

పాగమంచు పట్ల వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి

- రహదారి భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలి: ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు



మెదక్ బ్యూరో, నవంబర్ 18 (జనంసాక్షి): శీతాకాలం నేపథ్యంలో ఉదయం, రాత్రి వేళల్లో రహదారులపై పొగమంచు ఏర్పడుతోందని, దీనివల్ల వాహనాలు సరిగా కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు హెచ్చరించారు. వాహనదారులు అప్రమత్తంగా ఉంటూ రహదారి భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు నాణ్యమైన

మిగతా 10లో..

ఖేలో ఇండియా
యూత్ గేమ్స్ లోగో, మస్కట్ ఆవిష్కరణ



మెదక్ బ్యూరో, నవంబర్ 18 (జనంసాక్షి): 8వ ఎడిషన్ ఖేలో ఇండియా నేషనల్ యూత్ గేమ్స్-2026 లోగో, మస్కట్ గోడ పత్రికలను జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్, అదనపు కలెక్టర్ నగేష్‌తో కలిసి బుధవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 11 నుంచి 22 వరకు హైదరాబాద్‌తో పాటు వరంగల్, నిజామాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, కరీంనగర్ పట్టణాల్లో జాతీయ యువజన క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణలో జరుగుతున్న ఈ క్రీడలపై జిల్లాలోని యువత, క్రీడాకారులకు అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని క్రీడా ప్రాంగణాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్, ప్రధాన కూడళ్లలో లోగో, మస్కట్‌లతో కూడిన కటౌట్లు, బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్, జిల్లా యువజన, క్రీడల అధికారి రమేష్ గంగాల, గిరిజన సంక్షేమ అధికారి నీలిమ, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, ముఖ్య ప్రణాళిక అధికారి సురేష్, జిల్లా పౌర సంబంధాల అధికారి రామచంద్రరాజు, అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ రంగాచారి, ఈడీఎం సందీప్ తదితర అధికారులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోకు మూడేళ్లు.. కాంగ్రెస్ నయవంచనకు మూడేళ్లు

- ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది: ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి, నవంబర్ 18 (జనంసాక్షి): ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, మూడేళ్లు గడిచినా హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌తో సమానంగా భావించి ప్రతి హామీని అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్, ఇప్పుడు ప్రజలకు ఇచ్చిన మాటను విస్మరించిందని ఆరోపించారు. గొప్పగా చెప్పుకున్న అభయహస్తం నేడు శూన్యహస్తంగా మారిందని ఎద్దేవా చేశారు.



మల్లికార్జున ఖర్గే సమక్షంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేనిఫెస్టోను పవిత్ర గ్రంథాలతో పోల్చి, అధికారంలోకి వచ్చిన వెంటనే హామీలను అమలు చేస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. అయితే మూడేళ్లు గడిచినా హామీల అమలులో పురోగతి లేదన్నారు. గాంధీభవన్ వేదికగా తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాటను ఎందుకు నిలబెట్టుకోలేదో కాంగ్రెస్ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

తొలి కేబినెట్ సమావేశంలోనే ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, ఇప్పటివరకు 38 కేబినెట్ సమావేశాలు నిర్వహించినా ఆ దిశగా చర్యలు తీసుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ అధిష్ఠాన నేతలు మల్లికార్జున ఖర్గే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మేనిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్‌బాబు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు.

ఆరు గ్యారెంటీలు, 420 హామీల పేరుతో ప్రజల ఆశలను ఓట్లుగా మలుచుకుని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు ఒక్కొక్క హామీ కి తూట్లు పొడుస్తోందని ఆరోపించారు. హామీలను నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెట్టడమే ప్రభుత్వ సాధనగా మారిందన్నారు. కాంగ్రెస్ మోసపూరిత వైఖరిని ప్రజలు గుర్తించారని, రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీకి, చేసిన ప్రతి మోసానికి ఆ పార్టీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ హెచ్చరించారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అర్హులందరికీ పథకం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలి: కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 18 (జనంసాక్షి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అర్హులం దరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పథకం అమలు, విధివిధానాలు, లబ్ధిదారుల నమోదు ప్రక్రియపై సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18 నుంచి 59 ఏళ్ల వయసున్న అర్హులకు ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని మున్సి పాలిటీలు, గ్రామ పంచాయతీల్లో విడతల వారీగా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి అర్హుల వివరాలు సేక రించాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ వివరాలతో పాటు నామినీ వివరాలను స్పష్టంగా అందించాలని, దరఖాస్తు పత్రాలపై తప్పనిసరిగా సంతకం చేయాలని సూచించారు. శిబిరాల వద్ద పథకానికి సంబంధించిన ప్రచార ఫ్లెక్సీలు, తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేయాలని, వివరాల నమోదుకు కంప్యూటర్లు, సాంకేతిక పరికరాలు, సిబ్బందితో హెల్ప్‌డెస్క్‌లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రజలకు దరఖాస్తులు నింపడంలో సహకారం అందించేందుకు సహాయక కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

అర్హుల వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా పార దర్శకంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ప్రక్రియలో జాప్యం జరగకుండా ఎప్పటికప్పుడు వివరాలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రత్యేక అధికారులు శిబిరాలను నిరంతరం పర్యవేక్షించాలని, గ్రామ పంచా



యతీ కార్యదర్శులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిష నర్లు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధుల సహకారంతో విస్తృత ప్రచారం నిర్వహించి అర్హులందరూ పథకంలో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ ఉమాహారతి, అదనపు కలెక్టర్ పాండు, జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షికోత్సవం



అల్లాదుర్గం, నవంబర్ 18 (జనంసాక్షి): మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ తృతీయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు బసన్నగారి బలరాం, బాలకిషన్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో, పురోహితులు ప్రవీణ్ శర్మ పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు చేపట్టారు. సుప్రభాత సేవ, గణపతి పూజ, పుణ్యవచనం, స్వామివారికి విశేష అభిషేకం, సుదర్శన హోమం, లక్ష్మీనరసింహ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు స్వామివారికి బోనాలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పోటీలు

సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 18 (జనంసాక్షి): రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉస్మానియా విశ్వవిద్యా లయం డా.బి.ఆర్.అంబేద్కర్ పరిశోధనా కేంద్రం, సంగారెడ్డి తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల న్యాయ కళాశాల సంయు క్తంగా బుధవారం వ్యాసరచన, వక్తృత్వం, ప్రశ్నోత్తర పోటీలు నిర్వహించాయి. పాఠశాల, కళాశాల స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో సుమారు 18 విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు. పరిశోధనా కేంద్రం సంచాలకులు ప్రొఫెసర్ ఎం. లింగప్ప మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు, రాజ్యాంగ విలువలను విద్యార్థులకు తెలియజేయడమే కార్యక్రమ లక్ష్యమన్నారు. సమాన త్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలను యువత ఆచరించాలని డా.చలమల్ల వెంకటేశ్వర్లు సూచించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

బిఆర్ఎస్ పార్టీకి యువతే పట్టుకొమ్మలు

- రాబోవు రోజుల్లో యువతకి ప్రాధాన్యమిస్తాం
- బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మళ్లీ రావాలి కేసీఆర్ నువ్వే కావాలి కేసీఆర్ అంటూ మౌనయాత్ర
- రుద్ర సముద్రం రామలింగంను అభినందించిన కేటీఆర్



మక్తల్, నవంబర్ 18 (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి పదవి చేపట్టాలని గత నాలుగు రోజుల నుంచి మౌన యాత్రను ప్రారంభించిన రుద్రసంద్రం రామలింగం బుధవారం తెలంగాణ భవన్ కు చేరుకున్నది తెలంగాణ భవన్లో కేటీఆర్ రామలింగమును అభినందిస్తూ పార్టీకి క్రమశిక్షణతో కలిగిన ప్రతి ఉద్యమకారుడికి రాబోవు రోజుల్లో తప్పకుండా న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇలాంటి యాత్ర చేయడం ద్వారా యువతకు ఎంత స్ఫూర్తిదాయకమని ఆయన మనస్ఫూర్తిగా అభినందించారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే మళ్ళీ కేసీఆర్ ముఖ్యమంత్రి పదవి చేపట్టాలని రామ లింగం ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రంలో రైతాంగాన్ని, వైద్య రంగాన్ని, విద్యారంగ న్ని, ఐటి రంగాన్ని భారత్ లోనే అగ్రగామిక నిలిపిన ఘనత కేసీఆర్ దేనిని వారు అన్నారు. యాత్రలో భాగం గా హైదరాబాద్లోని జూబ్లీహిల్స్ పెద్దమ్మ దేవాలయంలో, జగన్నాథ స్వామి దేవాలయంలో, శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రావుల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ప్రభుత్వ విప్ తెలంగాణ ఉద్యమ నేత మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ మాజీ అల్లిపూర్ వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

కాలనీల అభివృద్ధికి పెద్దపీట.. బీరంగూడ అభివృద్ధికి రూ.3.33 కోట్ల నిధులు

అమీన్‌పూర్, నవంబర్ 18 (జనంసాక్షి): కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం అమీన్‌పూర్ సర్కిల్ బీరంగూడ డివిజన్ పరిధిలో రూ.3.33 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజక వర్గంలోని ప్రతి కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, జంక్షన్ల అభివృద్ధితో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడకుండా నిర్ణీత గడువులోగా



పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు కేటాయించి బీరంగూడ, అమీన్‌పూర్ ప్రాంతాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ.. ప్రాంతాల అభివృద్ధి ప్రభుత్వ బాధ్యత అని, ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో బీరంగూడ డివిజన్‌లోని పలు కాలనీల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. పనులు పూర్తయితే స్థానికులకు రవాణా, డ్రైనేజీ సమస్యలు తొలగిపోతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రావ్య, మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు, మున్సిపల్ అధికారులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

గంగారంలో అర్హులకు ఆసరా పింఛన్ మంజూరు పత్రాల పంపిణీ

- లబ్ధిదారులకు ఆర్థిక భరోసా - చంద్రం



సంగారెడ్డి, నవంబర్ 18 (జనంసాక్షి): కొండాపూర్ మండలం గంగారం గ్రామంలో అర్హులైన లబ్ధిదారు లకు ప్రభుత్వం మంజూరు చేసిన ఆసరా పింఛన్ పత్రాలను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ సరిత అశోక్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రం మాట్లాడుతూ ఆసరా పింఛన్ల ద్వారా అర్హులకు ఆర్థిక చేయూత అందించి గౌరవప్రదమైన జీవనం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడం అభినంద నీయమని పేర్కొన్నారు. సామాజిక భద్రతా పింఛన్లు పేదల జీవన భద్రతకు, ఆర్థిక స్వావలంబనకు తోడ్పడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి అక్రమ ఇసుక ట్రాక్టర్ పట్టివేత

- అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు: ఎస్సై వెంకటేష్



ఖిల్లా ఘనపురం, నవంబర్ 18(జనంసాక్షి): మండల పరిధిలోని తిరుమలాపల్లి గ్రామ శివారులో బుధవారం తెల్లవారుజామున సుమారు ఒంటి గంట సమయంలో పోలీసులు అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నారు.

స్థానిక పోలీస్ స్టేషన్‌కు చెందిన సిబ్బంది బీట్ డ్యూటీ నిర్వహిస్తుండగా, ఇసుకతో వెళ్తున్న బెంజ్ టిప్పర్ (నంబర్ ఎపి07ఖవీ9725)ను అనుమానంతో ఆపి తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో షాపూర్ గ్రామానికి చెందిన డ్రైవర్ సమల నాగరాజు వద్ద ఇసుక రవాణాకు సంబంధించిన ప్రభుత్వ అనుమతి పత్రాలు లేవని గుర్తించారు.

విచారణలో ఈ టిప్పర్ కొత్తపల్లి గ్రామానికి చెందిన పరమేశ్వర్ రెడ్డికి చెందినదిగా తేలింది. దీంతో టిప్పర్‌తో పాటు డ్రైవర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి, అక్రమ ఇసుక రవాణాకు పాల్పడిన డ్రైవర్, వాహన యజమానిపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ చేపట్టినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తే బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఈ సందర్భంగా హెచ్చరించారు.

పదేళ్ల నిరీక్షణకు ముగింపు...

- ప్రజా పాలనలో పెన్షన్ల పండుగ



అయిజ నవంబర్ 18 (జనంసాక్షి): చాలా రోజుల నిరీక్షణ తర్వాత కొత్తగా 4,63,857 పెన్షన్లు మంజూరు కావడంతో అయిజలో కాంగ్రెస్ నాయకుల సంబరాలు. అయిజ తెలంగాణ ప్రభుత్వం నూతనంగా పెన్షన్లు మంజూరు చేసిన సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్షావలి ఆచారి, సంకాపురం రాముడు, ఐజ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బడేసాబ్, ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు.

అయిజ పాత బస్టాండ్ కూడలిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి, బాణాసంచా కాల్చి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆనందోత్సాహాల మధ్య సంబరాలు జరుపుకున్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత పదేళ్లుగా పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన పేదలకు ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయంతో కొత్తగా పెన్షన్లు మంజూరు కావడం సంతోషకరమన్నారు.

వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్లు ఆర్థిక భరోసాగా నిలుస్తాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమం లో , చేనేత సంఘం చైర్మన్ డాన్ వీరన్న, సింగిల్ విండో చైర్మన్ సుజాత రాముడు, సింగిల్ విండో వైస్ చైర్మన్ దేవేంద్ర, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొత్త బోర్లకు అనుమతులు లేవు

- భూగర్భ జలాల పరిరక్షణకు సహకరించాలి: ఎమ్మార్వో కిరణ్



సిర్గాపూర్, నవంబర్ 18 (జనంసాక్షి): ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సరిగా కురవక భూగర్భ జలమట్టం పడిపోయిందని సిర్గాపూర్ ఎమ్మార్వో కిరణ్ తెలిపారు. మండల పరిధిలోని గ్రామాల్లో ప్రస్తుతం కొత్త బోర్లకు అనుమతులు లేవని స్పష్టం చేశారు. ఇప్పటికే ఉన్న బోర్లలో నీరు తగ్గుతున్న నేపథ్యంలో కొత్త బోర్లు వేస్తే నీటి కొరత మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. రాబోయే వేసవిలో నీటి సమస్య తీవ్రం కావచ్చని రైతులు, ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని సూచిం చారు. చెరువులు, కుంటలు, వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచుకోవాలని కోరారు. కొత్త బోర్లతో రైతులు ఆర్థికంగా నష్టపోకుండా జాగ్రత్త పడాలని అన్నారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా...

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై అవగాహన సమావేశం



సంగారెడ్డి, నవంబర్ 18 (జనంసాక్షి): ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్ సూచించారు. బుధవారం సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన కౌన్సిలర్లు, వార్డు ఆఫీసర్లు, ప్రజాప్రతినిధులకు ఈ పథకంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పథకం లక్ష్యాలు, అర్హతలు, ప్రయోజనాలు, అమలు విధానంపై వివరించారు.

కుటుంబ పెద్దను కోల్పోయిన సమయంలో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా రూ.5 లక్షల జీవిత బీమా సాయం అందించడం పథకం ప్రధాన ఉద్దేశమని చైర్‌పర్సన్ తెలిపారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన కుటుంబ పోషకులు ఈ పథకానికి అర్హులుగా ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. వయస్సు ధ్రువీకరణకు ఆధార్ కార్డును ప్రామాణికంగా తీసుకోనున్నట్లు వివరించారు.

నవంబర్ 19 నుంచి వార్డుల వారీగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు సమావేశంలో వెల్లడించారు. కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వార్డు ఆఫీసర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు సమన్వయంతో పనిచేసి అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని సూచించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రజలకు అందుబాటులో ఉండేలా శిబిరాలు ఏర్పాటు చేసి పథకంపై విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించే ఈ పథకం విజయవంతంగా అమలయ్యేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషిచేయాలని కూన వనిత సంతోష్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వార్డు ఆఫీసర్లు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



చేర్యాల సమస్యలను పరిష్కరించాలి...

సిద్దిపేట సభలో హామీలు అమలు చేయాలని సీఎంకు మున్సిపల్ చైర్‌పర్సన్ విజ్ఞప్తి



చేర్యాల, నవంబర్ 18 (జనంసాక్షి): చేర్యాల ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మున్సిపల్ చైర్‌పర్సన్ ముస్త్యాల అరుణ విజ్ఞప్తి చేశారు. బుధవారం చేర్యాల పట్టణంలోని బీఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ అరుణ, బాల నరసయ్యతో పాటు కౌన్సిలర్లు మాట్లాడుతూ పలు డిమాండ్లను వెల్లడించారు. గత ఎన్నికల సమయంలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో జనగామ సభలో చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడిచినా అమలు చేయలేదని విమర్శించారు. నేటి సిద్దిపేట సభలో చేర్యాల రెవెన్యూ డివిజన్ ప్రకటన చేయాలని కోరారు. మల్లన్నసాగర్ నుంచి గ్రావిటీ ద్వారా తపాస్‌పల్లి డ్యామ్‌కు నీటిని తరలించే కాలువ పనులను పూర్తిచేసి సాగు నీరు అందించాలని, ఎల్‌నినో ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత బకాయి రైతుబంధు సొమ్మును కూడా చెల్లించాలన్నారు. చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరారు. కొత్తగా ఏర్పడిన చేర్యాల మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.100 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ, మినీ స్టేడియం మంజూరు చేయాలని, నాలుగు మండలాల్లో రహదారుల మరమ్మతులకు రూ.200 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అసంపూర్తి కాలువల పనులు పూర్తి చేయడంతో పాటు చెరువుల్లో పూడికతీత చేపట్టాలన్నారు.

చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించి డయాలసిస్, స్కానింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు నిమ్మ సుప్రజ, రాజీవ్ రెడ్డి, కమలపురం గీతాంజలి, బూనాద్రి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ



నిజాంపేట, నవంబర్ 18 (జనంసాక్షి): నిజాంపేట మండలంలోని నందిగామ, నస్కల్, నందగోకులం గ్రామాలలో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో ఆకుల స్వప్న రమేష్, నాతి అంజమ్మ లక్ష్మా గౌడ్, భాను ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాలలో రేషన్ డీలర్లకు రేషన్ కార్డు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రేషన్ కార్డుల మంజూరు రేషన్ కార్డులు అప్డేట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంతో శ్రీకారం చుట్టిన తెలంగాణ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి గ్రామాలలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేయడం పంపిణీ చేయడం ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎడ్ల అంజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి యాదలక్ష్మి, మమత, రేషన్ డీలర్ పల్ల రేఖ, దేశెట్టి రాజు, రజిని, గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఊర్కొండకు నూతన

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మంజూరు

- ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన మండల ప్రజలు



ఊర్కొండ, నవంబర్ 18 (జనంసాక్షి); మండలానికి నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేయడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పీఏసీఎస్ మంజూరు కోసం కృషి చేసిన జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డికి మండల ప్రజలు స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రత్యేకంగా ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నిర్ణయంతో మండలంలోని గ్రామాల రైతులకు వ్యవసాయ రుణాలు, ఎరువులు, విత్తనాలు తదితర వ్యవసాయ సంబంధిత సేవలు స్థానికంగా అందుబాటులోకి రానున్నాయి. పీఏసీఎస్ ఏర్పాటు ద్వారా రైతులకు సహకార వ్యవస్థ మరింత చేరువ కానుంది. ప్రభుత్వ ఉత్తర్వుల అధికారిక ప్రతులు అందిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడి కానున్నాయి.

నిరుపేద కుటుంబానికి ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అండ



కొల్చారం, నవంబర్ 18 (జనంసాక్షి): కొల్చారం మండలం వరిగుంతం గ్రామానికి చెందిన మంగలి నర్సమ్మ కుటుంబానికి వైద్య ఖర్చుల నిమిత్తం నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి అండగా నిలిచారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ.3.25 లక్షల విలువైన ఎల్ఓసీ మంజూరుకు కృషి చేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబానికి సహాయం అందేలా చొరవ తీసుకున్నారు.

విద్యా ప్రమాణాల

పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ఎంఈఓ కె.జగదీష్ కుమార్



జడ్చర్ల, నవంబర్ 18 (జనంసాక్షి): విద్యా ప్రమాణాల పెంపు, ప్రభుత్వ పథకాల అమలుపై ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని మండల విద్యాధికారి (ఎంఈఓ) కె.జగదీష్ కుమార్ సూచించారు. బుధవారం జడ్చర్ల ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, కేజీబీవీ, రెసిడెన్షియల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూడైస్ ప్లస్ వివరాలను గడువులోగా 100 శాతం పూర్తి చేయాలని, 2027--28 విద్యా సంవత్సరానికి విద్యార్థుల షూ కొలతల నమోదు, ప్రస్తుత యూనిఫారాల పంపిణీని పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రాథమిక విద్యార్థుల్లో ఎఫ్ఎల్ఎన్ సామర్థ్యాల పెంపుతో పాటు ప్రశస్తి స్క్రీనింగ్‌ను వేగవంతం చేయాలని, స్కావెంజర్, సీఆర్సీ, పాఠశాల గ్రాంట్ల బిల్లులను పారదర్శకంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఎఫ్ఆర్ఎస్ హాజరు తప్పనిసరిగా సమయానికి నమోదయ్యేలా చూడాలన్నారు.

సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు అంతప్ప, వెంకట్ రెడ్డి, శ్రీనివాసులు, చంద్రకళ, విజయ్ కుమార్, జీహెచ్ఎంలు సరళా జాయ్, మారుతి నారాయణ, మల్లయ్య, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరాములపల్లిలో ఉచిత వైద్య శిబిరం



కోహెడ, నవంబర్ 18(జనంసాక్షి): మండలంలోని శ్రీరాముల పల్లి గ్రామంలో నూతన గ్రామపంచాయతీ కార్యాలయంలో డాక్టర్ గుండు రాకేష్ ఫిజియోథెరపిస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

ఈ వైద్య శిబిరానికి గ్రామంతో పాటు పరిసర గ్రామాల నుండి దాదాపు 70 మందికి పైగా పేషెంట్లు హాజరయ్యి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరంలో నడుము నొప్పి, భుజం నొప్పి, మెడ నొప్పి, మోకాళ్ల నొప్పులు, నరాల బలహీనత అలాగే పక్షవాతం వంటి సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి తగిన వైద్య సూచనలు, సలహాలు అందించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా అందించాలనే ఉద్దేశ్యంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరం ఏర్పాటు పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోలు శ్రీనివాస్, కార్యదర్శి స్వరూప, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ జీవిత బీమాతో ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా

- అర్హులైన ప్రతి కుటుంబాన్ని పథకంలో నమోదు చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు





మెదక్ బ్యూరో, నవంబర్ 18 (జనంసాక్షి): రాష్ట్రంలోని ప్రతి అర్హులైన కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు.

బుధవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ, కుటుంబంలో సంపాదించే వ్యక్తి ఆకస్మికంగా మరణిస్తే ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా రూ.5 లక్షల జీవిత బీమా కల్పించడమే పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. 18 నుంచి 59 సంవత్సరాల వయసు కలిగిన సంపాదించే వ్యక్తుల్లో ఒకరిని బీమా పరిధిలోకి తీసుకోవాలని, కుల, మత, ఆదాయ భేదాలు లేకుండా అర్హులందరికీ పథకం వర్తింపజేయాలని సూచించారు. బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. గ్రామాలు, పట్టణాలు, వార్డుల వారీగా ప్రత్యేక నమోదు శిబిరాలు ఏర్పాటు చేసి, రేషన్ కార్డులు లేని కుటుంబాలకు సైతం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని ఆదేశించారు. ఆధార్, కుటుంబ సభ్యులు, నామినీ వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని, మీ సేవ కేంద్రాల ద్వారా కూడా సేవలు అందుబాటులో ఉంచాలని తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ, మెదక్ జిల్లాలో పథకం అమలుకు అదనపు కలెక్టర్‌ను నోడల్ అధికారిగా నియమించనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవోలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో నమోదు ప్రక్రియ చేపడతామన్నారు. ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో విస్తృత అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి కుటుంబాన్ని పథకంలో నమోదు చేస్తామని వెల్లడించారు. అన్ని గ్రామాల్లో నమోదు శిబిరాలకు అవసరమైన ఇంటర్నెట్, ప్రింటర్, స్కానర్ వంటి సాంకేతిక సదుపాయాలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ నగేష్, ముఖ్య ప్రణాళిక అధికారి సురేష్, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సందీప్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

చేయూత పింఛన్‌తో భరోసా.. ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు



చేర్యాల, నవంబర్ 18 (జనంసాక్షి): కాలు కోల్పోయి ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న తనకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేయూత పింఛన్ మంజూరు చేసి ఆదుకుందని ఆకునూరు గ్రామానికి చెందిన వికలాంగుడు పుల్లని భాస్కర్ కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం గ్రామంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం తనను పట్టించుకోలేదని, సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పింఛన్ మంజూరు చేయడంతో కుటుంబ పోషణకు ఆర్థిక భరోసా లభించిందని ఆనందం వ్యక్తం చేశారు. పేదలు, వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు.

3వ వార్డులో ఆసరా పింఛన్ కార్డుల పంపిణీ



చేర్యాల, నవంబర్ 18 (జనంసాక్షి): చేర్యాల మున్సిపాలిటీ 3వ వార్డులో బుధవారం ఆసరా పింఛన్ కార్డులను కాంగ్రెస్ కౌన్సిలర్ కొమ్ము రాజేశ్వరి, మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ అభివృద్ధిని చూసి ఓర్వలేక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎన్ని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేశారో ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. తమ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

జిల్లాలో మరో 9 కొత్త సహకార సంఘాలు



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 18 (జనంసాక్షి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఎసిఎస్) విస్తరణలో భాగంగా సంగారెడ్డి జిల్లాకు 9 కొత్త సహకార సంఘాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులోభాగంగా సంగారెడ్డి జిల్లాలో ప్రస్తుతం ఉన్నా 52 తో పాటు మరో 9 సహకార సంఘాలు ఏర్పాటు చేస్తూ జీవో విడుదల చేసింది. సంగారెడ్డి జిల్లాలోని ముస్లాపూర్, పాల్వంచ, ఆత్మకూర్, తడ్కల్, జహీరాబాద్, మునిపల్లి, నిజాంపేట, నాగల్గిద్ద, వట్పల్లిలో సంఘాలను ఏర్పాటు చేయనున్నారు. సహకార సంఘాలు పెరగడంతో దూరం తగ్గి రైతులకు మేలు చేకూరనుంది. దీంతోపాటు రుణ సదుపాయం, విత్తనాలు, ఎరువుల పంపిణీ మరింత చేరువ కాలున్నాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. మునిపల్లి మండలానికి కొత్తగా సహకార సంఘం ఏర్పాటు కావడం పట్ల హర్షం వక్త చేశారు. రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చొరవతో జిల్లా వ్యాప్తంగా 9 సహకార సంఘాలు కొత్తగా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

చేయూత పింఛన్ లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేత






తూప్రాన్, నవంబర్ 18(జనంసాక్షి): తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డుకు చెందిన చేయూత పింఛన్ లబ్ధిదారులకు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ బొంది రజిని రవీందర్ గౌడ్ లు ప్రొసీడింగ్స్ అందజేశారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొంది రజిని రవీందర్ గౌడ్, నాలుగో వార్డు కౌన్సిలర్ రాథోడ్ జైపాల్ నాయక్, మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ పాల్గొని లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చలమేల రాములు, రాధాకుమారి, శ్రీనివాస్, స్వామి, వార్డు ఆఫీసర్ మహేష్‌తో పింఛన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్‌కు వినతి




అమీన్‌పూర్, నవంబర్ 18 (జనంసాక్షి): అమీన్‌పూర్ సర్కిల్ బీరంగూడ డివిజన్‌లో ఆయా కాలనీల్లో అభివృద్ధి పనులు చేయాలని అమీన్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కాలనీవాసులతో కలిసి జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్‌ను కలిసి ఎన్ఆర్ఐ ఆనంద్‌నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో పార్కులు అభివృద్ధి పనులు చేపట్టడం, బోర్‌వెల్ ఏర్పాటు, ఓపెన్ జిమ్, పార్కులో నీటి సదుపాయం వంటి మౌలిక వసతులు కల్పించాలని వినతిపత్రంలో కోరారు. కాలనీవాసులకు అవసరమైన సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చి పార్కును అభివృద్ధి చేయాలని కోరారు.

నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ సూచనల మేరకు కాలనీవాసుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తున్నామని తెలిపారు.

ముబారక్‌పూర్‌లో చేయూత పింఛన్ ప్రొసీడింగ్‌ల పంపిణీ



సదాశివపేట, నవంబర్ 18(జనంసాక్షి): సదాశివపేట మండలం ముబారక్‌పూర్‌లో అర్హులైన లబ్ధిదారులకు చేయూత పింఛన్ ప్రొసీడింగ్‌లను సిడిసి చైర్మన్ గడీల రాంరెడ్డి చేతుల మీదుగా స్థానిక సర్పంచ్ నవీన్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బలహీన వర్గాల ఆర్థిక అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ రత్నాకర్ రెడ్డి, సేవాదళ్ అధ్యక్షుడు కర్ణం సందీప్, పంచాయతీ కార్యదర్శి వనజ, గ్రామ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడు పోగుల రాజును పరామర్శించిన జిల్లా అధ్యక్షుడు



చిన్నశంకరంపేట, నవంబర్ 18 (జనంసాక్షి): చిన్నశంకరంపేట బీజేపీ మండల అధ్యక్షుడు పోగుల రాజును బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ పరామర్శించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పోలీసుల లాఠీఛార్జిలో రాజు కుడి భుజానికి గాయమై, తిరిగి ఇబ్బంది కలగడంతో ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న నాయకులు ఆయన స్వగృహానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు, రంజిత్ రెడ్డి, పబ్బ లక్ష్మణ్, ప్రసాద్, గడ్డం కాశీనాథ్, అవినాష్ రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన చేయూత పింఛన్ల ప్రొసీడింగ్స్ పంపిణీ



మద్దూరు, నవంబర్ 18 (జనంసాక్షి): మద్దూరు మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న పీఏసీఎస్ భవనంలో నూతన చేయూత పింఛన్ల ప్రొసీడింగ్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొడంగల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఎనుముల తిరుపతి రెడ్డి, కడా స్పెషల్ ఆఫీసర్ వెంకట్ రెడ్డి హాజరయ్యారు. వీరితో పాటు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ల ప్రొసీడింగ్స్ అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



కృష్ణ, నవంబర్ 18 (జనంసాక్షి): కృష్ణ మండలం హిందూపూర్ శివారులో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి కి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం 150 ఎన్ ఎచ్ హిందూపూర్ శివారులో సిమెంట్ లోడుతో వస్తున్నా టాటా ఏసీ ని ఓవర్ టేక్ చేయడానికి ప్రయత్నించడంతో ఢీ కొట్టింది.

ఈ ప్రమాదంలో వాహన దారుడు (రాజప్ప) సత్యనారాయణకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు అంబులెన్సు సమాచారం అందించి వెంటనే హుటాహుటిన అంబులెన్సు ద్వారా పోలీసులు, రాయచురు అస్పత్రి తరలించి చికిత్స పొందు తూన్నట్లు స్థానికులు తెలిపారు. పోలీసులకు పిర్యా దు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

జీవో నం.157
విడుదలపై సిద్దిపేట టిపిజెఎసి హర్షం



సంగుసూరు, (జనంసాక్షి): పాలిటెక్నిక్ కళాశాలలను తిరిగి ఉన్నత విద్యాశాఖ పరిధిలోనే కొనసాగిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నం. 157 పట్ల స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల టిపిజాక్ హర్షం వ్యక్తం చేసింది.

గతంలో పాలిటెక్నిక్‌లను కార్మిక శాఖ పరిధిలోకి తెస్తూ జారీ చేసిన జీవో 97ను రద్దు చేయాలని సాంకేతిక విద్యాశాఖ ఉద్యోగులు, విద్యార్థులు 35 రోజుల పాటు ఆందోళనలు చేసినట్లు టిపిజాక్ రాష్ట్ర సహ అధ్యక్షుడు, కళాశాల ప్రిన్సిపాల్ బూరం అభినవ్ తెలిపారు. దీనిపై ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ నివేదిక ఆధారంగా జీవో 157 విడుదలైందని పేర్కొన్నారు. అయితే, సాంకేతిక విద్యా మండలి, సాంకేతిక విద్యాశాఖ కొనసాగింపుపై మరింత స్పష్టత రావాలని కోరారు. ఈ సందర్భంగా టిపిజాక్ నాయకులు ప్రభుత్వానికి, కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన ఎమ్మెల్యే



మద్దకల్, నవంబర్ 18 (జనంసాక్షి): మండల పరిధిలోని పెద్దొడ్డి గ్రామంలో బుధవారం గ్రామానికి చెందిన గుడిసె నరసింహులు చెందిన ఇందిరమ్మ ఇల్లును గద్వాల ఎమ్మెల్యే బండ్లకృష్ణమోహన్ రెడ్డి ప్రారంభించారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి కావడం లబ్ధిదారులు నూతన గృహప్రవేశం చేయడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.గద్వాల నియోజకవర్గంలో మొదటి విడతలో 3500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం చేశారు.దాదాపుగా 2000 పైగా ఇండ్లు నిర్మాణం పనులు కొన సాగుతున్నత్వరగా ఇంటి నిర్మాణం పనులు పూర్తి చేసుకొనిగృహ ప్రవేశాలు చేసుకోవాలని,ఈ ఇందిరమ్మ రాజ్యంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదింటి ప్రజల సొంతింటి కల ప్రజాపాలన సీఎం రేవంత్ రెడ్డితో సాధ్యమైనది అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు,సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, మాజీ ఎంపీపీ రాజారెడ్డి,మాజీ జెడ్పిటిసి ప్రభాకర్ రెడ్డి, నాయకులు విక్రంసింహారెడ్డి, నరేందర్ రాముడు, మధు, వెంకటన్న, నరసింహారెడ్డి, భాస్కర్ గౌడ్, ఆంజనేయులు, గోపాల్,తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్‌లో ఇందిరమ్మ జీవిత బీమా పాలసీపై అవగాహన సదస్సు



ఆత్మకూర్, నవంబర్ 18 (జనంసాక్షి): ఆత్మకూర్ మున్సిపల్ పరిధిలో ఈనెల 19న ప్రారంభం కానున్న ఇందిరమ్మ జీవిత బీమా పాలసీపై మున్సిపల్ కమిషనర్ నరేష్ కుమార్ బుధవారం నాడు వార్డు కౌన్సిలర్లు, సభ్యులకు అవగాహన కల్పించారు.

ఒక రేషన్ కార్డుకు ఒకరికి రూ.5లక్షల బీమా ఇన్సూరెన్స్ కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఇన్సూరెన్స్ 18 నుండి 59 సంవత్సరాల వయస్సు గల వారికి వర్తిస్తుందని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ నాగమణి రాజేష్, వైస్ చైర్మన్ నల్లగొండ శ్రీనివాసులు, వార్డు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

మోడిఫైడ్ సైలెన్సర్లతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు

సుమారు 200 సైలెన్సర్లను రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేసిన పోలీసులు





సంగారెడ్డి, నవంబర్ 18 (జనంసాక్షి): ద్విచక్ర వాహనాలకు మోడిఫైడ్ సైలెన్సర్లు అమర్చుకుని అధిక శబ్దా లతో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ సత్యయ్య గౌడ్ హెచ్చ రించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశాల మేరకు సంగారెడ్డి పట్టణంలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక తని ఖీలు నిర్వహించారు.

ఈ తనిఖీల్లో కంపెనీ సైలెన్సర్ల ను తొలగించి, అధిక శబ్దాలు వచ్చే మోడిఫైడ్ సైలెన్సర్ల ను వినియోగిస్తున్న సుమారు 200 ద్విచక్ర వాహనాల ను పోలీసులు గుర్తించారు.

మోటారు వాహనాల చట్టం ప్రకారం ఆయా వాహన దారులకు జరిమానాలు విధించడంతో పాటు వాహనాలకు అమర్చిన మోడిఫైడ్ సైలెన్సర్లను తొలగించి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సుమారు 200 సైలెన్సర్లను బుధవారం రోడ్డు రోలర్ సహాయంతో ధ్వంసం చేశారు.

ఈ సందర్భంగా డీఎస్పీ సత్యయ్య గౌడ్ మాట్లాడుతూ మోడిఫైడ్ సైలెన్సర్లతో పెద్ద శబ్దాలు చేస్తూ రోడ్లపై తిరగడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు, ఇతర వాహనదారులకు అసౌకర్యం కలిగించే ఇటువంటి చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. శబ్ద కాలుష్యానికి కారణమయ్యే వాహనాలపై పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందని, నిబంధనలు ఉల్లంఘించే వారిని గుర్తించి సైలెన్సర్లు తొలగించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజలకు ప్రశాంతమైన వాతావరణం కల్పించడం, రహదారులపై క్రమశిక్షణను పెంపొందించడం పోలీసుల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ రెడ్డి, రూరల్ సీఐ నయీముద్దీన్, టౌన్ సీఐ రాము నాయుడు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

- **ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుకు వినతిపత్రం**



మెదక్, నవంబర్ 17 (జనంసాక్షి): రేషన్ డీలర్లకు రూ.5 వేల గౌరవ వేతనంతో పాటు రూ.300 కమిషన్ పెంచాలని తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నాయకులు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావును కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేసేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో మాట్లాడాలని వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో 17,200 మంది రేషన్ డీలర్లు ఉన్నారని, తక్కువ కమిషన్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కరువు పరిస్థితుల్లో రేషన్ కార్డుదారులకు మరిన్ని నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని కోరారు. డీలర్ల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి.ఆనంద్, ప్రధాన కార్యదర్శి ఎల్.సుధాకర్, అజీమ్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇందిరమ్మ
కుటుంబ జీవిత బీమా దరఖాస్తుల స్వీకరణ

- **అర్హులైన కుటుంబాలు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి: కార్యదర్శి రవికుమార్**



ఖిల్లా ఘనపురం, నవంబర్ 18 (జనంసాక్షి): తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించనున్నట్లు గ్రామ కార్యదర్శి రవికుమార్ తెలిపారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తి అనుకోకుండా మరణిస్తే ఆర్థిక భరోసా కల్పించడమే పథకం లక్ష్యమన్నారు. నవంబర్ 19 నుంచి డిసెంబర్ 18, 2026 వరకు గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తి వయస్సు 18 నుంచి 59 ఏళ్ల మధ్య ఉండాలని, ఒకరి కంటే ఎక్కువ మంది సంపాదిస్తుంటే ఒకరిని ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు. రేషన్ కార్డు ఉన్నవారితో పాటు లేనివారికి కూడా నమోదు అవకాశం ఉందన్నారు. దరఖాస్తుకు బీమా పొందే వ్యక్తి ఆధార్, కుటుంబ సభ్యుల వివరాలు, నామినీ ఆధార్, మొబైల్ నంబర్ అవసరమని పేర్కొన్నారు. అర్హులందరూ శిబిరాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

భూనీడ్‌లో 30 మందికి చేయూత పింఛన్ పట్టాల పంపిణీ



కొత్తపల్లి నవంబర్ 18 (జనంసాక్షి): ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 4.63 లక్షల మంది వితంతు, ఒంటరి మహిళలు, వికలాంగులకు నూతన పింఛన్లు అందించనుంది. ఇందులో భాగంగా బుధవారం కొత్తపల్లి మండలం భూనీడ్ గ్రామానికి చెందిన 30 మంది లబ్ధిదారులకు చేయూత పింఛన్ పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పుష్ప శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్య, దుప్పటిగట్టు సర్పంచ్ గోనెల వెంకటయ్య, కిషన్ నగర్ సర్పంచ్ ఆంజనేయులు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేశ్ యాదవ్, వార్డు సభ్యులు లాలు భాయ్, ప్రశాంత్, శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు ఘన సన్మానం



చిలప్‌చేడ్, నవంబర్ 18 (జనంసాక్షి): ఫైజాబాద్ గ్రామానికి చెందిన సూర్యాపేట శ్రీనివాస్ రెడ్డి నర్సాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎన్నికైన సందర్భంగా గ్రామపంచాయతీ పాలకవర్గం, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. సర్పంచ్ రాములు, ఉప సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో శాలువా కప్పి, పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎన్నిక కావడం గ్రామానికి గర్వకారణమని, రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కుమార్, ప్రసాద్, బుడ్డు, ఎంసీ విట్టల్, శశికాంత్, నాగేష్, గోపాల్ రావు, యాదేశ్, సుధాకర్, రవి, సత్యగౌడ్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



గద్వాల, నవంబరు 18 (జనంసాక్షి): జిల్లాలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని పీడీఎస్‌యు జిల్లా అధ్యక్షుడు హలీం పాషా తీవ్రంగా ఆరోపించారు. ప్రత్యేక తరగతుల పేరుతో ఉదయం 6 గంటల నుంచే విద్యార్థులను పాఠశాలలకు రప్పిస్తూ, రాత్రి 7గంటల వరకు నిర్బంధిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా సుదీర్ఘ సమయం పాటు తరగతులు నిర్వహించడం వల్ల చిన్నారులు తీవ్రమైన మానసిక, శారీరక ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా, విద్యార్థులకు విశ్రాంతి దొరకాల్సిన ఆదివారాలు, రెండో శనివారాలతో పాటు ఇతర ప్రభుత్వ సెలవు దినాల్లోనూ తరగతులు నిర్వహిస్తూ వేధిస్తున్నారని మండిపడ్డారు. పాఠశాలల యాజమాన్యాల తీరుతో విద్యార్థులు ఆటపాటలకు దూరమై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి ఇలాంటి ప్రైవేట్ పాఠశాలలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ సెలవుల్లో క్లాసులు నిర్వహిస్తున్న విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీరెల్లి దానయ్య, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

రోజుకు 200 ఆభా కార్డుల జనరేషన్ లక్ష్యం.. 108 అంబులెన్స్ సేవలపై అవగాహన పెంచాలి: కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి, నవంబర్ 18 (జనంసాక్షి):
జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో అమలవుతున్న అన్ని కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వివిధ వైద్య కార్యక్రమాల పురోగతిని పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆభా (ABHA) కార్డుల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతిరోజూ కనీసం 200 కార్డులు జనరేట్ చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుని పనిచేయాలని ఆదేశించారు. అత్యవసర సమయాల్లో ప్రాణరక్షణకు ఉపయోగపడే 108 అంబులెన్స్ సేవలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, అవసరమైన వారికి సకాలంలో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.



జిల్లాలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను విస్తృతం చేసి వ్యాధులను ముందస్తుగా గుర్తించేలా చూడాలని సూచించారు. తద్వారా బాధితులకు సకాలంలో వైద్య చికిత్స అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. టీ-హబ్ ద్వారా రోగులకు అవసరమైన వైద్య పరీక్షలు అందుబాటులో ఉండేలా చూడాలని, పరీక్షల ఫలితాల ఆధారంగా మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులకు సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని ప్రతి కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారులు సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ భాస్కర్ నాయక్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్ర మోహన్, ఇతర వైద్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షురాలికి జన్మదిన శుభాకాంక్షలు



పెద్దశంకరంపేట, నవంబర్ 18 (జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి జన్మదినం సందర్భంగా జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కోణం విట్టల్ ఆమె నివాసంలో శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కౌన్సిలర్ నాగరాజు, బీజేపీ నాయకులు చంద్రశేఖర్, విక్రం పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ సాయం



రామాయంపేట, నవంబర్ 18 (జనంసాక్షి): మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు చొరవతో రామాయంపేట మండలం సుతార్‌పల్లి గ్రామానికి చెందిన బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి మంజూరైన రూ.20 వేల చెక్కును గ్రామ సర్పంచ్ మద్దూరి సునీ ల్ అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో అండగా నిలుస్తోందన్నారు. బాధిత కుటుంబం ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ యాదగిరి, వార్డు సభ్యులు రాగి అశోక్, శామార్తి స్వామి, గ్రామ అధ్యక్షుడు ఏరుపుల దుర్గం పాల్గొన్నారు.

క్రీడలతో విద్యార్థుల్లో శారీరక మానసిక వికాసం



మద్దూరు, నవంబర్ 18 (జనంసాక్షి): మద్దూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా స్థాయి 14 సంవత్సరాల లోపు బాలబాలికల కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మద్దూరు మున్సిపాలిటీ చైర్మన్ దిలీకర్ సరస్వతి జనార్ధన్ హాజరై మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థులకు శారీరకంగా, మానసికంగా ఎంతో అవసరమని, ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లోనూ పాల్గొనాలని సూచించారు. జిల్లా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. క్రీడల్లో ప్రతిభ కనబరిచి నారాయణపేట జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని, రాష్ట్రస్థాయిలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

మండల విద్యాధికారి జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల మానసిక వికాసానికి క్రీడలు ఎంతో ముఖ్యమని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సవిత మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటప్ప, బాలరాజు, శ్రీనివాసరెడ్డి, సాయినాథ్, రవికుమార్, వెంకటేష్, గణేష్, నరసింహారెడ్డి, జగన్మోహన్ గౌడ్, రాజవర్ధన్‌తో పాటు ఉమ్మడి జిల్లా పరిధిలోని పీఈటీలు పాల్గొన్నారు.

డ్రగ్స్, గంజాయి సంస్కృతికి బీజం వేసింది బీఆర్ఎస్ పాలనే

- **పల్లా రాజేశ్వర్ రెడ్డి వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ నాయకులు**

చేర్యాల, నవంబర్ 18 (జనంసాక్షి): గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోనే తెలంగాణలో డ్రగ్స్, గంజాయి సంస్కృతి పెరిగిందని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. బుధవారం చేర్యాల పట్టణంలోని కేపీఆర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.

బీఆర్ఎస్ పాలనలో అవినీతి, అక్రమ సంపాదనతో కొందరు నాయకులు, కార్యకర్తలు మత్తు పదార్థాల సంస్కృతిని ప్రోత్సహించారని ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నుంచి గ్రామస్థాయి కార్యకర్తల వరకు డ్రగ్స్, గంజాయి వినియోగంపై వస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గంజాయి డీలర్లుగా కొందరు చెలామణి అవుతున్నారనే ఆరోపణలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డ్రగ్స్, గంజాయి మాఫియాను అరికట్టేందుకు ఈగల్ టీమ్స్ ఏర్పాటు చేసి మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. యువత భవిష్యత్తును నాశనం చేసే మత్తు పదార్థాలపై ప్రభుత్వం రాజీలేని పోరాటం చేస్తోందన్నారు.



జనగామ నియోజకవర్గంలో గతంలో ప్రశాంతమైన రాజకీయ వాతావరణం ఉండేదని, పల్లా రాజేశ్వర్ రెడ్డి వచ్చిన తర్వాత వ్యక్తిగత విమర్శలు, అనవసర వివాదాలు పెరిగాయని విమర్శించారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన నాయకులు వ్యక్తిగత విమర్శలకు దిగడం సరికాదన్నారు.

పల్లా ముందుగా గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన పరిణామాలపై ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే స్థాయికి తగిన హుందాతనంతో వ్యవహరించాలని, నిరాధార ఆరోపణలు, బాధ్యతా రహిత వ్యాఖ్యలు మానుకోవాలని హితవు పలికారు. లేకపోతే ప్రజాక్షేత్రంలో తగిన రాజకీయ గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో సిద్దిపేట డీసీసీ ఉపాధ్యక్షుడు పూర్మ ఆగంరెడ్డి, కాటం సంజీవయ్య, మంజె మల్లేశం, దాసరి శ్రీకాంత్, మారెళ్ల భాస్కర్ రెడ్డి, బండి శ్రీనివాస్ గౌడ్, జక్కిరెడ్డి సుదర్శన్ రెడ్డి, పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్ పట్టివేత

అనుమతులు లేకుండా దుందుభి వాగు నుంచి ఇసుక తరలింపు.. పోలీసులకు అప్పగింత

ఉప్పునుంతల, (జనంసాక్షి): మండలంలో అక్రమ ఇసుక రవాణాపై రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. బుధవారం (18.11.2026) తెల్లవారుజామున అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను డిప్యూటీ ఎమ్మార్వో రమేష్ పట్టుకుని ఉప్పునుంతల పోలీసులకు అప్పగించారు.

మామిళ్లపల్లి గ్రామ శివారులోని పోచమ్మ దేవాలయం వద్ద ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను (నంబర్ టీఎస్ 31 హెచ్ 7249) డిప్యూటీ ఎమ్మార్వో రమేష్ గుర్తించి అడ్డుకున్నారు. అనంతరం ట్రాక్టర్‌ను పోలీసులకు అప్పగించారు. విచారణలో దాసర్లపల్లి గ్రామ శివారులోని దుందుభి వాగు నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు వెల్లడైంది.

ట్రాక్టర్ డ్రైవర్ మేడమోని శివ, వాహన యజమాని పదర వెంకటేష్ వివరాలను పోలీసులు సేకరించారు. వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు ఉప్పునుంతల ఎస్సై పుట్ట మహేష్ తెలిపారు. ప్రభుత్వ సహజ వనరులను అక్రమంగా తరలించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

సొంత నిధులతో బోరు వేయించిన అభిమన్యు రెడ్డి



రాజాపూర్, నవంబర్ 18 (జనంసాక్షి): రాజాపూర్ మండలం బీబీనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని సేవ్య నాయక్ తండాలో బీఆర్ఎస్ జడ్చర్ల నియోజకవర్గ యువనేత చించోడ్ అభిమన్యు రెడ్డి తన సొంత నిధులతో బోరు వేయించి తాగునీటి సౌకర్యం కల్పించారు. బుధవారం బోరు మోటారును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు. వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. తండాలో బోరు ఏర్పాటు చేసి నీటి సౌకర్యం కల్పించిన అభిమన్యు రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ యాదమ్మ, ఉపసర్పంచ్ వినోద్ నాయక్, మాజీ సర్పంచ్ గోవింద్ నాయక్, గ్రామస్తులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సమాన అవకాశాలు కల్పిస్తాం

- **నైబర్‌హుడ్ సెంటర్‌కు నూతన భవనం సమకూరుస్తాం: గూళ్ల నరసింహులు**



మద్దూరు, నవంబర్ 18 (జనంసాక్షి): మద్దూరు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత దివ్యాంగ బాలబాలికలకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గూళ్ల నరసింహులు మాట్లాడుతూ.. దివ్యాంగులకు సమాజంలో సమాన అవకాశాలు కల్పించడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషిచేస్తామని తెలిపారు. దివ్యాంగులకు పునరావాస సేవలు అందిస్తున్న నైబర్‌హుడ్ సెంటర్‌కు అవసరమైన నూతన భవనాన్ని సమకూరుస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నైబర్‌హుడ్ సెంటర్‌కు క్రమం తప్పకుండా వచ్చి పునరావాస సేవలు పొందుతున్న దివ్యాంగుల తల్లిదండ్రులను శాలువాలతో సన్మానించారు. ఆటల పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు, మండల మహిళా సమాఖ్య అధ్యక్ష,కార్యదర్శులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు నియోజకవర్గంలో

3,350 మందికి చేయూత పింఛన్లు మంజూరు

- లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసిన మంత్రి వివేక్ వెంకటస్వామి, కాట శ్రీనివాస్ గౌడ్, నీలం మధు

గుమ్మడిదల, నవంబర్ 18 (జనంసాక్షి): పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వం శుభవార్త అందించింది. నియోజకవర్గ పరిధిలో కొత్తగా 3,350 మందికి చేయూత పింఛన్లు మంజూరు చేసింది. ఈ మేరకు బుధవారం గుమ్మడిదల టోల్‌గేట్ సమీపంలోని జీఎస్ఎన్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.





ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పటాన్‌చెరు నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్, మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి నీలం మధుతో కలిసి మంత్రి లబ్ధి దారులకు పింఛన్ల మంజూరు పత్రాలను అందజేశారు. కొత్తగా పింఛన్లు మంజూరు కావడంతో అర్హులైన లబ్ధిదారులకు ప్రతినెలా ఆర్థిక భరోసా లభించనుంది. ప్రభుత్వ సహకారంతో తమకు పింఛన్లు మంజూరు కావడంపై లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞత లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయ కులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక నాయ కులు, నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మించాలి

- అదనపు డీఆర్‌డీఓ బాలరాజు

కంది, నవంబర్ 18(జనంసాక్షి):
మామిడిపల్లి గ్రామంలోని ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మించాలని అదనపు డీఆర్‌డీఓ బాలరాజు సూచించారు. బుధవారం కంది మండలంలోని మామిడి పల్లి గ్రామ పంచాయతీని సందర్శించిన ఆయన, గ్రామంలో చేపడుతున్న వ్యక్తిగత ఇంకుడు గుంతలు, మురుగు కాలువల చివర నిర్మిస్తున్న ఇంకుడు గుంతల పనులను పరిశీలించారు. ఇప్పటివరకు 42 వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణ పనులు ప్రారంభించినట్లు అధికారులు వివరించారు.





ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ, ఇళ్ల నుంచి వెలువడే వాడుక నీరు రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో నిల్వ ఉండకుండా ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. దీనివల్ల పారిశుద్ధ్యం మెరుగుపడటంతో పాటు దోమల బెడద, అంటువ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. మామిడిపల్లిని వంద శాతం ఇంకుడు గుంతలు కలిగిన ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దా లని అధికారులను ఆదేశించారు. మురుగు కాలువల చివర నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి అవసరమైన చోట ఇంకుడు గుంతలు నిర్మించాలని సూచిం చారు.

ఈ కార్యక్రమంలో ఏపీడీ మధులత, మండల పంచాయతీ అధికారి మహేందర్ రెడ్డి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

టెండర్ల రద్దుతో బెజ్జంకి అభివృద్ధికి బ్రేక్: మాజీ ఎమ్మెల్యే డా.రసమయి బాలకిషన్

- చిత్తశుద్ధి ఉంటే సీఎంను కలిసి నిధులు ఢ తీసుకురావాలి
- మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో మిగిలింది హామీలేనా?

బెజ్జంకి, నవంబర్ 18 (జనంసాక్షి):
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా బెజ్జంకి మండలంలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే డా. రసమయి బాలకిషన్ విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన అభివృద్ధి పనులు సైతం నిలిచిపోయాయని ఆరోపించారు. బుధవారం బెజ్జంకి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మం డల అధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

గత ముఖ్యమంత్రి కేసీఆర్ బెజ్జంకి మండల అభివృద్ధి కోసం రూ.20 కోట్లు మంజూరు చేశారని గుర్తుచేశా రు. ప్రతి గ్రామంలో ఫంక్షన్ హాళ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, బతుకమ్మ విగ్రహాలు, వారసంతల నిర్మాణా నికి నిధులు కేటాయించారని తెలిపారు. టెండ ర్ల ప్రక్రియ పూర్తయ్యే సమయంలో జీవో రద్దు చేయడంతో పనులు నిలిచిపోయాయని విమర్శించారు. రూ.1.50 కోట్లతో చేపట్టాల్సిన 32 అభివృద్ధి పనులు అసంపూర్తి గా ఉన్నాయని, బెజ్జంకి–కల్లేపల్లి–రేపాక డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లతో టెండర్లు పూర్తయినా పను లు ప్రారంభం కాలేదన్నారు. రేగులపల్లి–పోతారం–బెజ్జంకి, బేగంపేట–బెజ్జంకి రహదారుల పనులు పెం డింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. పోతారం–బెజ్జంకి మధ్య రూ.1.50 కోట్లతో కల్వర్టు నిర్మాణం పూర్తయి నా, రోడ్డు నిర్మాణానికి సంబంధించిన రూ.6 కోట్ల టెండర్లు రద్దుకావడంతో ప్రజలు ఇబ్బందులు పడు తున్నారని తెలిపారు.



కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో పాటు తులం బంగారం, మహిళలకు స్కూటీలు, దళితబంధు కింద రూ.12 లక్షలు, రైతు భరోసా వంటి హామీల అమ లులో విఫలమైందని ఆరోపించారు. మూడేళ్ల పాలన లో సాధించిన అభివృద్ధి ఏమిటని ప్రశ్నించారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట జిల్లా పర్యటన నేపథ్యం లో ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణకు చిత్తశుద్ధి ఉంటే సీఎంను కలిసి బెజ్జంకి అభివృద్ధికి నిధులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. పెండింగ్ పనులు పూర్తి చేయించాలని, లేనిపక్షంలో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని సవాల్ విసిరారు. ఈ సమా వేశంలో బీఆర్ఎస్ నాయకులు, సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చిన్నఘనపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు, నూతన పింఛన్ల పంపిణీ



కొల్చారం, నవంబర్ 18 (జనంసాక్షి): కొల్చారం మండలం చిన్న ఘనపూర్ గ్రామంలో అర్హులైన ముగ్గురు లబ్ధిదారులకు ఇంది రమ్మ ఇళ్ల పట్టాలను సర్పంచ్ చందాపురం మధుసూదన్ రెడ్డి పంపిణీ చేశారు. చాకలి కృష్ణ, కుంటి స్వప్న, నన్ సావత్ సాలికి పట్టాలు అందజేశారు. అనంతరం నూతనంగా మంజూరైన పింఛ న్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్ర మంలో ఉపసర్పంచ్ అంకమ్మ నర్సింలు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ నాయకులు, వార్డు సభ్యులు, ఇతర ప్రజాప్రతి నిధులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌ను ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దాలి

- నిషేధిత ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని అరికట్టాలి: కొప్పుల రమేష్

నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, నవంబర్ 18 (జనంసాక్షి):
నాగర్‌కర్నూల్ పట్టణంలో నిషేధిత ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు, వినియోగాన్ని పూర్తిస్థాయిలో అరికట్టాలని టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి, అడహక్ కమిటీ సభ్యుడు టైగర్ కొప్పుల రమేష్ అధికారులను కోరారు.



ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి హానికరమని, వ్యర్థాలు డ్రైనేజీల్లో పేరుకుపోవడంతో మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు.

పట్టణంలోని కిరాణా దుకాణాలు, కూరగాయల మార్కెట్లు, హోటళ్లు, ఇతర వ్యాపార సముదాయాల్లో మున్సిపల్ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై జరిమానాలు విధించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరంతర పర్యవేక్షణతో ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలని కోరారు.

ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయంగా పేపర్ బ్యాగులు, గుడ్డ సంచులు, పర్యావరణహిత సంచులను ఉపయోగించాలని వ్యాపారులు, ప్రజలకు సూచించారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను కోరారు. పట్టణాన్ని పరిశుభ్రంగా, ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, వ్యాపారులు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బాలకృష్ణ, సుబ్బారెడ్డి, దివాకర్ నాయుడు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై కూర్చొని ఆసుపత్రి కాంట్రాక్టు కార్మికుల నిరసన

- ప్రైవేట్ ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేయాలి

వీపనగండ్ల, నవంబర్ 19 (జనంసాక్షి):
ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, సెక్యూరిటీ,పేషెంట్ కేర్,సూపర్వైజర్ కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలను రూ.26 వేలకు పెంచాలని కార్మికులు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యలను ప్రభు త్వం వెంటనే పరిష్కరించాలని,లేనిపక్షంలో పాలకులకు ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత తప్పదని హెచ్చరిం చారు. రాష్ట్రవ్యాప్తంగా గత ఏడు రోజులుగా ఆసుపత్రి కాంట్రాక్టు కార్మికులు చేపడుతున్న ఆందోళనలో భాగంగా బుధవారం వీపనగండ్ల ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట కార్మికులు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ కనీస వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలని, ప్రైవేట్ ఏజెన్సీ వ్యవస్థను రద్దుచేసి కార్పొరేషన్ ద్వారా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.



ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు అందించాలని,పీఎఫ్,ఈఎస్ఐ సౌకర్యాలను సక్రమంగా అమలు చేయాలని కోరారు.పండుగలు, జాతీయ పర్వదినాల సెలవులను వర్తింపజేయడంతో పాటు పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.రోగుల మలమూత్రా లను శుభ్రం చేస్తూ, ఆసుపత్రుల్లో నిరంతరం సేవలందిస్తున్న పారిశు ద్ధ్య కార్మికుల జీవితాలు మాత్రం ఆర్థిక ఇబ్బందులతో అస్తవ్యస్తంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సేవలను ప్రశంసిస్తున్న ప్రభుత్వం వారి వేతనాలు పెంచ డంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇప్పటికే పలుమార్లు నిరసనలు, ధర్నాలు,ముట్టడి కార్యక్రమాలు నిర్వహించ డంతో పాటు ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా సమస్యలు పరిష్కారం కాకపోవడం బాధాకరమన్నారు.

ప్రభుత్వం ఇకనైనా కాలయాపన చేయకుండా కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.

ఈ నిరసన కార్యక్రమంలో ఆసుపత్రి బ్రాంచ్ కాంట్రాక్టు కార్మికులు దయాకర్, గణేష్, అనిల్, మన్నెమ్మ, లింగమ్మ, పార్వతమ్మ, అలివేలు, రేణుక, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతమే ధ్యేయంగా పనిచేయాలి

• నూతన కార్యవర్గానికి బాధ్యతల అప్పగింత



గండీడ్, నవంబర్ 18 (జనంసాక్షి): గండీడ్ మండలంలో బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు నూతన కార్యవర్గ సభ్యులు సమష్టిగా కృషి చేయాలని మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి పిలుపు నిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నూతన కార్యవర్గానికి బాధ్యతలు అప్పగించి, సభ్యులను శాలువాలతో సత్కరించారు. ప్రధాన కార్యదర్శులుగా నియమితులైన ఎన్. భద్రేశ్వర్, శ్రీనివాస్‌లను అభినందించారు.

నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షులుగా కావలి నర్సిములు, సంతెం వెంకటేష్, చాకలి బలయ్య, ఎం. గణేష్ గౌడ్, కార్యదర్శులుగా కాకి నరేష్, పి. వెంకట్ రెడ్డి తదితరులు నియమితులయ్యారు. కోశాధికారిగా పట్లావత్ సంతోష్, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా రాజేశ్వరి, యువ మోర్చా అధ్యక్షుడిగా పుల్లారి నవీన్ యాదవ్ బాధ్యతలు చేపట్టారు.

ఈ సందర్భంగా విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ అప్పగించిన బాధ్యతలను అంకిత భావంతో నిర్వహించాలని, సీనియర్ కార్యకర్తల సూచనలతో ప్రతి ఒక్కరినీ కలుపుకొని ముందుకు సాగాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ప్రతి గ్రామంలో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు.

విద్యతో పాటు నైపుణ్యాలను కూడా పెంపొందించుకోవాలి

• హస్తకళల అభివృద్ధి అధికారి గౌతమ్ దత్త



ఉప్పునుంతల, నవంబర్ 18 (జనంసాక్షి): విద్యతో పాటు అదనపు నైపుణ్యాలను నేర్చుకోవడం విద్యార్థులకు భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుందని తెలంగాణ హస్తకళల అభివృద్ధి అధికారి గౌతమ్ దత్త అన్నారు. గ్రామీణ ప్రాంత యువత హస్తకళలపై ఆసక్తి పెంచుకొని వాటిని ఉపాధి అవకాశాలుగా మలుచుకోవాలని సూచించారు.

నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కేంద్ర ప్రభుత్వ హస్తకళల శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన క్రాఫ్ట్ డెమాన్స్ట్రేషన్ అండ్ అవేర్‌నెస్ ప్రోగ్రాం (సీడీఏపీ) బుధవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గౌతమ్ దత్త మాట్లాడుతూ ప్రకృతి వనరులతో కళాత్మక వస్తువులను తయారు చేయడం ద్వారా ఆర్థికంగా ఎదగవచ్చన్నారు. ఉద్యోగ అవకాశాలు పరిమితంగా ఉన్న నేపథ్యంలో నైపుణ్యాభివృద్ధి ఉపాధికి మార్గం చూపుతుందని పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వహణకు సహకరించిన మాతృభూమి సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

మాతృభూమి సంస్థ అధ్యక్షుడు రమాకాంత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు నీలా శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులకు హస్తకళలపై ఉచిత శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. నవంబర్ 16 నుంచి 18 వరకు నిర్వహించిన శిక్షణలో 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పెయింటింగ్, బంజారా హ్యాండ్ ఎంబ్రాయిడరీ, టై అండ్ డై, గాజుల అలంకరణ వంటి కళల్లో శిక్షణ పొందారు. వ్యాసరచన పోటీలో భార్గవి, పూజ, హాజీర వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించగా, చిత్రలేఖన పోటీలో వాణి, భవాని, శివ విజేతలుగా నిలిచారు. వారికి మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాతృభూమి సంస్థ వ్యవస్థాపకురాలు ప్యారసాని మంజుల, శిక్షకులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలల రక్షణ చట్టాలపై వైద్యులకు అవగాహన

• జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య





సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 18 (జనంసాక్షి): బాలలపై లైంగిక నేరాల నివారణ, బాధితులకు సత్వర వైద్య సహాయం అందించడం, వారి హక్కులను పరిరక్షించడంలో వైద్యులు కీలక పాత్ర పోషించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య సూచించారు. సంగారెడ్డి జిల్లా మహిళా ప్రాంగణంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులకు పోక్సో చట్టం--2012, వైద్య గర్భస్రావ చట్టం, బాలల సంరక్షణ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడుతూ.. 18 ఏళ్లలోపు వారందరికీ పోక్సో చట్టం వర్తిస్తుందని, బాలలపై లైంగిక నేరాలు జరిగినట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించడం వైద్యుల బాధ్యతని తెలిపారు. బాధిత బాలల గోప్యతను కాపాడుతూ, ఎలాంటి భయాందోళనలకు గురిచేయకుండా వైద్య సేవలు అందించాలని, పోలీసు ఫిర్యాదు కోసం చికిత్సను ఆలస్యం చేయకూడదని సూచించారు. వైద్య, ఫోరెన్సిక్ ఆధారాలను భద్రపరచడంతో పాటు బాధితులకు మానసిక సహాయం, పునరావాస సేవలు అందేలా చూడాలన్నారు. బాలల రక్షణకు సంబంధించి వైద్యులు చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ రాజారెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి లలితకుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ లలితా దేవి, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణ, ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా ఉండాలి

• తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్



తూప్రాన్, నవంబర్ 18 (జనంసాక్షి): బాలికలు ఆత్మరక్షణతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకొని ధైర్యంగా ఉండా లని తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ సూచించారు. బుధవారం తూప్రాన్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఎలాంటి పరిస్థితుల్లోనైనా భయపడ కుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని తెలిపారు. వ్యక్తిగత భద్రతపై అవగాహన కలిగి ఉండటంతో పాటు ఆపద సమ యంలో సమయస్ఫూర్తితో నిర్ణయాలు తీసు కోవడం ముఖ్యమన్నారు. ఇతరులపై ఆధార పడకుండా తమను తాము రక్షించుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థినులకు సూచించారు.

అనంతరం కరాటే శిక్షకులు భిక్షపతి, నైనీష ఆత్మరక్షణకు సంబంధించిన పలు పద్ధతులను ప్రాక్టికల్‌గా ప్రదర్శించి, ఆపద సమయంలో వాటిని ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణ, ఎస్సైలు గంగరాజు, జ్యోతి, షీ టీమ్ సభ్యురాలు స్వరూప, పోలీసు సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామ మహిళా సంఘ భవనాలు త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలి

• జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక



నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 18(జనంసాక్షి): గ్రామ మహిళా సంఘ భవనాలు త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో 206 వివో భవనాలకు రూ.3.50 కోట్ల నిధులు మంజూరయ్యాయని విడతల వారీగా మిగతా అన్నింటికీ నిధులు మంజూరయ్యాయని వాటిలో ఇంతవరకు కోస్గి మండలం బిజ్జారం రూ.4.37, కృష్ణా మండలం మురహరి దొడ్డి రూ.8.83, ఊట్కూరు మండలం పెద్ద జత్రం రూ.8.6, చిన్న పొరల రూ.9.36 లక్షల భవన నిర్మాణ పనులు పూర్తి అయ్యాయని వాటికి నిధులు మంజూరై బిల్లులు చెల్లిస్తారని తెలిపారు. అలాగే మదనపల్లి 4.73 లో పూర్తి కాలేదని తెలిపారు.

వివిజీరామ్ ప్రోగ్రాం ద్వారా చేసిన పనులకు పేమెంట్స్ పూర్తయ్యాయని తెలిపారు. అన్ని గ్రామాల సర్పంచులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచి వివో భవనాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని 206 వివో భవన నిర్మాణ పనులకు సంబంధించిన ఎమౌంట్ అందరికి వస్తాయని మార్చి 2027 లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

సర్పంచ్ ఆగారం పద్మమ్మ ప్రకాష్ ప్రత్యేక చొరవతో 112 మందికి చేయూత

• హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



ఖిల్లా ఘనపురం, నవంబర్ 18 (జనంసాక్షి): మండల కేంద్రంలో సర్పంచ్ ఆగారం పద్మమ్మ ప్రకాష్ ప్రత్యేక చొరవతో మొదటి విడతలో 112 మంది అర్హులకు చేయూత పింఛన్లు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే మేఘా రెడ్డితో కలిసి సర్పంచ్ స్వయంగా లబ్ధిదారులకు పింఛన్లు అందజేయడంతో గ్రామస్థులు, లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిరుపేదలు, వితంతువులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, దివ్యాంగులకు పింఛన్లు అందేలా ప్రత్యేక కృషి చేయడం పట్ల సర్పంచ్ ఆగారం పద్మమ్మ ప్రకాష్‌కు గ్రామస్థుల నుంచి ప్రశంసలు అందుతున్నాయి.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఆగారం ప్రకాష్ మాట్లాడుతూ.. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్యం, తాగునీరు వంటి అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అదే విధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన పేదలకు నేరుగా అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

భవిష్యత్తులోనూ గ్రామ ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను నిరంతరం చేపడతామని తెలిపారు. ఇందుకు సంబంధిత శాఖల అధికారులు, గ్రామస్థులు, వార్డు సభ్యులు తమకు ఎప్పటికప్పుడు సహకరించాలని కోరారు.

భర్తను దూషిస్తూ భార్యకు బెదిరింపులు..

• పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించిన బాధితురాలు

రాజోలి, నవంబర్ 18 (జనంసాక్షి): ఉపాధి కోసం ఓ వ్యక్తికి మగ్గం ఇప్పించేందుకు సహకరించినందుకు మరో వ్యక్తి నుంచి బెదిరింపులు ఎదురవుతున్నాయని రాజోలి గ్రామానికి చెందిన కెంచుగుండు మహేశ్వరి ఆరోపిస్తూ బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం..తన భర్త సురేష్‌కు స్నేహితుడైన సాయే గోవింద్ వారి ఇంటికి వచ్చి నేత కూలి పని చేసుకునేందుకు మగ్గం ఇప్పించాలని కోరాడు. దీంతో సురేష్ తనకు పరిచయస్తుడైన వ్యక్తి ద్వారా గోవిందకు మగ్గం ఇప్పించేందుకు సహకరించారు. ఈ విషయం తెలుసుకున్న వంక మంజునాథ్ తన భర్తకు ఫోన్ చేసి గోవింద్‌కు మగ్గం ఎందుకు ఇప్పించావంటూ దుర్భాషలాడినట్లు మహేశ్వరి ఆరోపించారు. అంతేకాకుండా ఫోన్‌లో అసభ్య పదజాలంతో దూషిస్తూ, ఇంటి వద్దకు వచ్చి దాడి చేస్తానని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనతో తాము తీవ్ర భయాందోళనకు గురవుతున్నామని, తమ కుటుంబ సభ్యుల భద్రతపై ఆందోళన చెందుతున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు స్పందించి తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. తనను, తన భర్తను బెదిరించిన వ్యక్తిపై విచారణ జరిపి తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కెంచుగుండు మహేశ్వరి పోలీసులను విజ్ఞప్తి చేశారు.

బ్యానర్ తొలగించడం సరైనది కాదు...



రాజాపూర్, నవంబర్ 18(జనంసాక్షి): నియోజకవర్గంలో సామాజిక సేవకుడిగా జర్పుల భాస్కర్ నాయక్ ఈ మధ్యకాలంలో చాలా గ్రామాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.

మంగళవారం రోజున పలుగుగుట్ట తాండాలో తుల్జా భవాని పూజా కార్యక్రమంలో పాల్గొనడానికి వస్తున్న భాస్కర్ నాయక్‌కు స్వాగతం పలుకుతూ, భాస్కర్ నాయక్ యువసేన సభ్యులు ఏర్పాటు చేసిన బ్యానర్‌లను రంగారెడ్డి గూడ గ్రామం దగ్గర కొందరు గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారని, ఇది సరైనది కాదని భాస్కర్ నాయక్ యువసేన సభ్యులు తెలిపారు.



సీఎంఆర్ఎఫ్ కింద

41 మందికి చెక్కుల పంపిణీ

ఆత్మకూర్, నవంబర్ 18 (జనంసాక్షి):
మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు ఆత్మకూర్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన 41 చెక్కులను బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు.
ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ఎండీ రహమతుల్లా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్. నాగేశ్వర్, పట్టణ అధ్యక్షుడు ఈర్లదిన్నె శ్రీనివాసులు, యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. హరీష్ గౌడ్ పాల్గొన్నారు.
ఆర్థిక సాయం అందించిన మంత్రి శ్రీహరికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు జాబితా రూపకల్పనలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలి

నిర్ణీత గడువులోగా జాబితా తయారీ పూర్తి చేయాలి: కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల నడిగడ్డ, నవంబర్ 18 (జనంసాక్షి):
పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఓటరు జాబితా డీ-నోవో ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు, రెండు తెలుగు రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, రోల్ అబ్జర్వర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని జిల్లాలో ఓటరు నమోదు పురోగతిని వివరించారు.
జోగులాంబ గద్వాల జిల్లాలో ఇప్పటివరకు 22,987 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకున్నారని, మరో 40 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. గత ఎన్నికల సమయంలో 14,172 మంది ఓటర్లుగా నమోదయ్యారని పేర్కొన్నారు. పెండింగ్ దరఖాస్తులను నిబంధనల ప్రకారం త్వరగా పరిశీలిస్తామని చెప్పారు. డిసెంబర్ 30న తుది ఓటరు జాబితా ప్రకటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడికి నమోదు అవకాశం కల్పిస్తూ, అనర్హుల పేర్లు చేరకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు పత్రికలు, బహిరంగ ప్రకటనల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు మాట్లాడుతూ ప్రస్తుత ఓటరు జాబితా తయారీ పూర్తిగా కొత్తగా చేపడుతున్న డీ-నోవో ప్రక్రియ అని, గతంలో ఓటరుగా నమోదైనవారు కూడా తిరిగి దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. దరఖాస్తుదారుల విద్యార్హత ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి



అర్హులైన వారినే జాబితాలో చేర్చాలని సూచించారు. ఒకే వ్యక్తి పేరు వేర్వేరు ప్రాంతాల్లో నమోదు



కాకుండా, పేరు, తండ్రి పేరు, చిరునామా తదితర వివరాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. అనుమానాస్పద దరఖాస్తులపై క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలని తెలిపారు.
ఓటరు నమోదు సాఫ్ట్‌వేర్, ఆన్‌లైన్ వ్యవస్థలను ముందుగానే పరీక్షించి సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వారి సూచనలు, అభ్యంతరాలను నమోదు చేయాలని సూచించారు. రోల్ అబ్జర్వర్లు క్షేత్రస్థాయిలో పరిశీలన ప్రక్రియను పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏఓ మంజుల, వివిధ మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

పాలన సౌలభ్యం కోసమే పంచాయతీల ఏర్పాటు: ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

శివ్వంపేట, నవంబర్ 18 (జనంసాక్షి): పాలన సౌలభ్యం కోసమే అదనపు గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేయడం జరిగిందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. శివ్వంపేట మండలం చెన్నాపూర్ గ్రామంలో వివిజీ రాంజీ రూ. 10 లక్షలతో మంజూరైన మహిళా సమైక్య భవనానికి బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలన ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ తండాలను గ్రామ పంచాయతీలు చేశారన్నారు. నియోజకవర్గంలో గ్రామపంచాయతీ లేని గ్రామాలను గుర్తించి భవనాలను మంజూరు చేస్తామన్నారు. 500 లోపు జనాభా ఉన్న గ్రామాలకు రూపాయలు 20 లక్షలతో, 500 నుంచి 2000 వరకు జనాభా ఉన్న గ్రామాలకు రూపాయలు 25 లక్షలతో, అదే విధంగా వెయ్యి నుంచి ఆపై పెద్ద గ్రామాలకు 30 లక్షలతో వివిజీ రంజి ద్వారా గ్రామపంచాయతీ భవనాలను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా మహిళా సమైక్య భవనాలు లేకపోవడంతో ఐకెపి మహిళా సంఘాల సభ్యులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి, ప్రత్యేక భవనాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ భవనాలు నిర్మాణం పూర్తయితే మహిళలు నెల నెల సమావేశాలు పెట్టుకోవడానికి ఎంతో ఉపయోగకరంగా మారుతుందన్నారు. అనంతరం పింఛన్ మంజూరు పత్రాలను, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆకుల కొమురయ్య, ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ, పిఆర్ఏఈ భాస్కరరావు, ఐకెపి సీసీ సుజాత, ఉప సర్పంచ్ శ్రీలత శ్రీనివాస్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, మండల పార్టీ అధ్యక్షుడు రమణ గౌడ్, టిక్యా దేవమ్మ గూడెం సర్పంచ్ తేజస్విని రాజేందర్ నాయక్ నాయకులు రామచందర్ గౌడ్, బోళ్ల ఆంజనేయులు, సింగిరెడ్డి యుద్ధం రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, యాదగిరి, బోయిని సతీష్ యాదవ్, అంజాగౌడ్ వెంకటరెడ్డి గ్రామస్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



5వ వార్డులో పాత విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి

అమరచింత, నవంబర్ 17 (జనంసాక్షి): మున్సిపాలిటీలోని 5వ వార్డులో పాత విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ రాధా అరుణ్ కుమార్ తెలిపారు. పాత



స్తంభాలు వంగిపోవడంతో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతూ షార్ట్‌సర్క్యూట్‌లు, ప్రమాదాలు జరిగే అవకాశం ఉండేదన్నారు. ప్రస్తుతం ప్రధాన రహదారి వెంట కొత్త స్తంభాలు ఏర్పాటు చేస్తున్నామని, అనంతరం కాలనీలోనూ కొత్త స్తంభాలు వేసి పాత విద్యుత్ తీగల స్థానంలో కొత్త వైర్లు అమర్చుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో



కోఆప్షన్ సభ్యులు ఎస్. అజయ్, శ్యామ్, గోపి, సుభాష్, ఎస్. విజయ్, ఫ్రాంక్లిన్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలలు చైతన్యవంతులు కావడానికి ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు

చిన్నశంకరంపేట, నవంబర్ 18 (జనంసాక్షి):
మహిళలు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని సర్పంచ్ నాయిని ప్రవీణ్ కుమార్ తెలిపారు. మండలంలోని చందంపేట గ్రామంలో తెలంగాణ ట్రైనింగ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో 30 మంది మహిళలకు రెండు నెలలపాటు ఉచిత కుట్టుమిషన్ శిక్షణ ఇచ్చారు. బుధవారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్పంచ్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. సంస్థ డైరెక్టర్ ఎండీ షాయాజుద్దీన్ మాట్లాడుతూ కలెక్టర్



ఆదేశాల మేరకు మండలంలోని పలు గ్రామాల్లో శిక్షణ కేంద్రాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నర్సింలు, వార్డు సభ్యులు, సంస్థ ఇన్‌చార్జ్ మాధవి, ట్రైనర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 21న అంతర్జాతీయ మత్స్య కార్మిక దినోత్సవం

- **ఘనంగా నిర్వహిద్దాం జిల్లా అధ్యక్షుడు కాంత్ కుమార్**

నారాయణపేట, నవంబర్ 18(జనంసాక్షి):
అంతర్జాతీయ మత్స్య కార్మిక దినోత్సవాన్ని ఈ నెల 21న ఘనంగా నిర్వహిద్దామని నారాయణపేట జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు ఏ.కాంత్ కుమార్ కోరారు. బుధవారం ఆయన అధ్యక్షతన నారాయణపేటలో వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతు సంఘంలో సభ్యత్వం లేని వారు నమోదు చేసుకోవాలని సూచించారు.అందరూ సంఘటితంగా మత్స్య కార్మికుల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దలు సరాఫ్ నాగరాజ్ ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు, బి.వెంకటయ్య ముదిరాజ్ సం



ఘం పట్టణ అధ్యక్షులు, ఏ.రాము కౌన్సిల్ ముదిరాజ్ సంఘం యువత అధ్యక్షులు, వకీల్ సంతోష్, కాకర్ల భీమయ్య, కొనంగేరి హన్మంతు, వకిల్ ప్రశాంత్, గొవింద్ గేరి లక్ష్మికాంత్,కార్తిక్, బసవపురం వెంకటేశ్, సంకలపురం మల్లేష్, కాశ్మిష్ సంతోష్, మన్నె సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోహిర్ ఎక్స్‌రోడ్డులో ఘోర రోడ్డు ప్రమాదం.. వ్యక్తి మృతి

- **గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి**
- **జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యుల నిర్ధారణ**
- **గుర్తుతెలియని వాహన డ్రైవర్‌పై కేసు నమోదు**

కోహిర్, నవంబర్ 18 (జనంసాక్షి):
సంగారెడ్డి జిల్లా కోహిర్ మండల పరిధిలోని కోహిర్ ఎక్స్‌రోడ్డు వద్ద బుధవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రాజధాని వెంచర్ ముందు నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలై మృతి చెందాడు.
పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఝరాసంగం మండలం ఎల్గోయి గ్రామానికి చెందిన గినియార్పల్లి విఠల్ (50) బుధవారం ఉదయం సుమారు 7:30 గంటల సమయంలో కోహిర్ ఎక్స్‌రోడ్డు వద్ద రాజధాని వెంచర్ ముందు నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో ముంబై నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ వచ్చి విఠల్‌ను ఢీకొట్టాడు. దీంతో ఆయన ఎడమ దవడ, ఎడమ మోకాలికి తీవ్ర రక్తగాయాలయ్యాయి.
విషయం తెలుసుకున్న మృతుడి భార్య గినియార్పల్లి రాసమ్మ, బంధువు గొల్ల శేఖర్‌తో కలిసి ప్రమాద స్థలానికి చేరుకున్నారు. అనంతరం విఠల్‌ను చికిత్స నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు విధుల్లో ఉన్న వైద్యులు నిర్ధారించారు.
మృతుడికి మొదటి భార్య ద్వారా ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉండగా, రెండో భార్య రాసమ్మకు ఒక కుమారుడు ఉన్నాడు. కుటుంబాన్ని పోషించేందుకు



రాసమ్మ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.
ఈ ఘటనపై మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని వాహనం, డ్రైవర్ ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి



నారాయణపేట జిల్లా బ్యూరో నవంబర్ 18 (జనం సాక్షి): ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతున్నది అని నారాయణ పేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి అన్నారు.ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తూ ప్రజల ఆకాంక్షలు ముందుకు తీసుకు పోతున్నామన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత,ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేస్తు ప్రజల కలలు నెరవేరుస్తామని అన్నారు.

రానున్న రోజుల్లో అందరికీ సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. మంగళవారం దామరగిద్ద మండల కేంద్రంలోని భవాని మాత ఆలయం దగ్గర దామరగిద్ద మండలానికి చెందిన చేయూత పెన్షన్లు,సిఎం రిలీఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అలాగే నారాయణపేట మండల కేంద్రంలోని అభినందన్ గార్డెన్స్ లో నారాయణపేట మండలానికి చెందిన లబ్ధిదారులకు, అనంతరం నారాయణపేట పట్టణ కేంద్రంలోని ఎస్ ఆర్ గార్డెన్స్‌లో నారాయణపేట మున్సిపాలిటీకి చెందిన చేయూత పెన్షన్లు, సిఎం రిలీఫ్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, కౌన్సిలర్స్, పిఎసిఎస్ అధ్యక్షులు,యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నడిగడ్డ టాలెంట్ టెస్ట్ కరపత్రం ఆవిష్కరణ



మల్దకల్, నవంబర్ 18 (జనంసాక్షి): జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో నడిగడ్డ తెలంగాణ సోషల్ ఫోరం ఆధ్వర్యంలో బుధవారం సోషల్ డే సందర్భంగా లక్ష రూపాయల బహుమతులతో నిర్వహించే సోషల్ టాలెంట్ టెస్ట్ కరపత్రంను జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో నడిగడ్డ తెలంగాణ సోషల్ ఫోరం జిల్లా అధ్యక్షులు పాల్వాయి లక్ష్మీనారాయణ,ప్రధాన కార్యదర్శి కొండాపురం ప్రతాప్, టిటియుజిల్లా ప్రధాన కార్యదర్శి మేడికొండ ఈశ్వర్,రాజు సాగర్,శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

5వ వార్డులో
కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు

అమరచింత, నవంబర్ 17 (జనంసాక్షి):
మున్సిపాలిటీలోని 5వ వార్డులో పాత విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ రాధా అరుణ్ కుమార్ తెలిపారు. పాత స్తంభాలు వంగిపోవడంతో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతూ షార్ట్‌సర్క్యూట్‌లు, ప్రమాదాలు జరిగేవని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రధాన రహదారి వెంట కొత్త స్తంభాలు ఏర్పాటు చేస్తున్నామని, త్వరలో కాలనీలోనూ కొత్త స్తంభాలు వేసి పాత వైర్ల స్థానంలో కొత్తవి అమర్చుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు అజయ్, శ్యామ్, గోపి, సుభాష్, విజయ్, ఫ్రాంక్లిన్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

చీకర్ల బండ తండాలో నూతన గృహప్రవేశం



మహమ్మదాబాద్, నవంబర్ 18 (జనంసాక్షి): మహమ్మదాబాద్ మండల పరిధిలోని గాధిర్యాల్,గ్రామపంచాయతీ అనుబంధ చీకర్ల బండ తండాలో నూతన గృహప్రవేశ వేడుక ఘనంగా నిర్వహించారు. నూతన గృహంలోకి అడుగుపెట్టిన కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేసి, వారి జీవితం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.రాఘవేందర్ రెడ్డి, ఆముదాల గడ్డ తండా సర్పంచ్ రామచందర్, ఉపసర్పంచ్ హరిశ్చందర్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు జి.చంద్రయ్య హాజరై నూతన గృహప్రవేశ వేడుకలో పాల్గొన్నారు.ఈసందర్భంగా కుటుంబ సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆముదాలగడ్డ తండా పంచాయతీ కార్యదర్శి, గాధిర్యాల్ మినీ బ్యాంక్‌కు చెందిన జి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత



మక్తల్, నవంబర్ 18 (జనంసాక్షి): మక్తల్ శివారులోని చందాపూర్ గడ్డ వద్ద బుధవారం పోలీసులు నిర్వహించిన తనిఖీలలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న భారత్ బెంజ్ టిప్పర్‌ను పట్టుకున్నారు. రాయచూరు వైపు నుండి మరికల్ వైపు వెళ్తున్న AP 07 ఖఎ 9009 నంబర్ గల టిప్పర్‌ను ఆపి తనిఖీ చేయగా, అది నిండుగా ఇసుకతో ఉన్నట్లు గుర్తించారు. ఇసుక తరలింపునకు సంబంధించి ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో డ్రైవర్‌ను విచారించారు. మరికల్ మండలం పల్లెగడ్డ గ్రామానికి చెందిన డ్రైవర్ గుర్రాల రాజును ప్రశ్నించగా.. వడ్వాట్ వాగు నుండి ఈ ఇసుకను అక్రమంగా నింపుకున్నట్లు తేలింది. టిప్పర్ యజమాని లక్ష్మీకాంతరెడ్డి (మరికల్) ఆదేశాల మేరకే ఇసుకను మరికల్ తరలిస్తున్నట్లు డ్రైవర్ అంగీకరించారు. దీంతో ఇసుక టిప్పర్‌ను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించి, సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జడ్జిని సన్మానించిన న్యాయవాద కుటుంబం



నారాయణపేట, నవంబర్ 18(జనంసాక్షి):
నారాయణపేట పట్టణానికి చెందిన సత్య నారాయణరెడ్డి ఇటీవల జడ్జిగా ఎంపికైన సందర్భంగా బుధవారం నారాయణపేటలో సీనియర్ న్యాయవాద కుటుంబ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది నాగురావు నామాజీ నారాయణరెడ్డిని అభినందిస్తూ పుట్టిన ఊరికి తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకు రావాలనిసూచించారు.ఈకార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ విఠల్‌రావు నామాజీ న్యాయవాదులు నందు నామాజీ,ప్రవీణ్ నామాజీ తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు శిక్షలు.. భారీ జరిమానాలు

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక నిఘా....

మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని ఎస్సీ తెలిపారు. నర్సాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి న్యాయస్థానం 10 రోజుల జైలు శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధించినట్లు వెల్లడించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వారిపై కోర్టుల ద్వారా జైలు శిక్షలు, జరిమానాలు విధించే అవకాశం ఉందని, ఎవరూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు ప్రయాణ సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగం, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడవచ్చన్నారు. జరిమానాలు విధించడం పోలీసుల లక్ష్యం కాదని, రోడ్డు ప్రమాదాలను తగ్గించి విలువైన ప్రాణాలను కాపాడటమే పోలీసుల ప్రధాన ఉద్దేశమని ఎస్సీ స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వాహనాలు నడుపుతూ రోడ్డు భద్రతకు సహకరించాలని కోరారు.

ఇంటర్ విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణి



మల్దకల్, నవంబర్ 18 (జనంసాక్షి):
మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ప్రభుత్వం నుండి ఉచితంగా అందిస్తున్న యూనిఫాములను విద్యార్థులకు ప్రిన్సిపల్ శ్రీలతారెడ్డి చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఇన్ని రకాల వస్తువులు వినియోగించుకుని మంచి చదువుతో కళాశాలకు గుర్తింపు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నరసింహులు, రామాంజనేయులుగౌడ్ భాగ్యలక్ష్మి,గోవర్ధన్ శెట్టి, రాఘవేంద్ర,మాధురి, శ్రీకాంత్,సుధాకర్, రంగస్వామి,ఈఫ్తికర్ కమలహాసన్,అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో అధికారుల తనిఖీలు



మద్దూరు, నవంబర్ 18 (జనంసాక్షి): మద్దూరు పట్టణంలోని పెట్రోల్ బంకులపై ఫిర్యాదులు రావడంతో జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి డి.సత్యనారాయణ బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీలక్ష్మి పెట్రోల్ బంక్, ఎస్ఆర్ఎం పటేల్ పెట్రోల్ బంక్‌లలో తనిఖీలు చేపట్టారు. పెట్రోల్ పంపిణీ కొలతలను పరిశీలించిన అనంతరం ఎలాంటి అవకతవకలు లేవని అధికారులు నిర్ధారించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



వెల్దండ, నవంబర్ 18 (జనంసాక్షి): వెల్దండ మండల పరిధిలోని గుండాల గ్రామానికి చెందిన పేరుమల్ల శ్రీశైలం మృతి చెందడంతో గ్రామ సర్పంచ్ జక్కుల శిరీష వెంకటయ్య యాదవ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5,000 ఆర్థిక సాయం అందజేశారు. ఉప సర్పంచ్ పేరుమల్ల మనీషా సైదులు రూ.2,500 అందించగా, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎనుముల గోపాల్ యాదవ్ సైతం తనవంతు ఆర్థిక సహాయం చేశారు.అలాగే బాధిత కుటుంబానికి వావిళ్ల తిరుపతయ్య, కొమ్ము లింగం, పేరుమల్ల కృష్ణ, పేరుమల్ల శ్రీను, హనుమంతు నాయక్, సురేష్ నాయక్ అండగా నిలిచారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

పొగమంచు పట్ల
వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి



ద్విచక్ర వాహనదారులు నాణ్యమైన హెల్మెట్ ధరించాలని, వేగాన్ని తగ్గించి ముందున్న వాహనానికి తగినంత దూరం పాటించాలని తెలిపారు. రాత్రివేళల్లో తక్కువ వెలుతురు దీపాలు ఉపయోగించాలని, ప్రతిబింబించే దుస్తులు ధరించాలని, మలుపుల వద్ద ముందుగానే సూచిక దీపాలు వేయాలని సూచించారు. పొగమంచు అధికంగా ఉన్నప్పుడు అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయకూడదన్నారు.

నాలుగు చక్రాల వాహనదారులు ఫాగ్ లైట్లు లేదా లో బీమ్ దీపాలను మాత్రమే ఉపయోగించాలని, అద్దాలపై ఆవిరి పేరుకుపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ముందున్న వాహనానికి ఎక్కువ దూరం పాటిస్తూ నెమ్మదిగా ప్రయాణించాలని, పొగమంచులో మలుపుల వద్ద ఇతర వాహనాలను అధిగమించే ప్రయత్నం చేయరాదన్నారు. ప్రయాణానికి ముందు వాహనంలోని దీపాలు, బ్రేకులు, అద్దాలు, వైపర్లు సక్రమంగా ఉన్నాయో తనిఖీ చేసుకోవాలని సూచించారు.

రోడ్డు సరిగా కనిపించని పరిస్థితుల్లో సురక్షితమైన ప్రదేశంలో వాహనాన్ని నిలిపివేయాలని, తొందరపాటు ప్రయాణాలు నివారించాలని ఎస్సీ పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించకూడదని స్పష్టం చేశారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సీ విజ్ఞప్తి చేశారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంను విజయవంతం చేయాలి

- నవంబర్ 19న సిద్దిపేట నుంచి పథకాన్ని ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- అన్ని జిల్లాలు, మండలాలు, గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో పండుగ వాతావరణంలో ప్రారంభోత్సవాలు నిర్వహించాలి
- రెండు వారాల పాటు గ్రామాలు, వార్డుల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి దరఖాస్తులు సేకరించాలి
- ప్రతి కుటుంబం నుంచి బీమా పొందే వ్యక్తి, నామినీ వివరాలతో దరఖాస్తులు సేకరించాలి
- సోషల్ మీడియాతో పాటు అన్ని ప్రచార మాధ్యమాల ద్వారా పథకంపై విస్తృత అవగాహన కల్పించాలి

గద్వాల నడిగడ్డ, నవంబర్ 18 (జనంసాక్షి);
ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, దరఖాస్తుల సేకరణ, ప్రజలకు అవగాహన కల్పించడం తదితర అంశాలపై బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గద్వాల సమీకృత కలెక్టరేట్ కార్యాలయం నుంచి పలువురు జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నవంబర్ 19న సిద్దిపేట జిల్లా నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని లాంఛనంగా ప్రారంభించ నున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి ప్రారంభించే సమయంలోనే రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలు, గ్రామాలు, మున్సిపాలిటీల్లోని వార్డుల్లో కూడా పథకాన్ని ఒకేసారి ప్రారంభించాలని స్పష్టం చేశారు.

ప్రారంభోత్సవ కార్యక్రమాలను పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వ హించాలని, స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేస్తూ అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రారంభోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు.

రెండు వారాల పాటు ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలి...
ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా ప్రతి కుటుంబానికి బీమా భద్రత కల్పించనున్న నేపథ్యంలో ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తులు సేకరించాలని సీఎస్ సూచించారు. రాబోయే రెండు వారాల పాటు గ్రామాల వారీగా, మున్సిపల్ వార్డుల వారీగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించి దరఖాస్తుల సేకరణ చేపట్టాలని ఆదేశించారు. ప్రతి కుటుంబానికి సంబంధించిన దరఖాస్తు ఫారాన్ని సేకరించాలని, అందులో బీమా పొందే వ్యక్తి వివరాలు, నామినీ వివరాలు తదితర అవసరమైన సమాచారాన్ని స్పష్టంగా నమోదు చేయించాలని తెలిపారు. దరఖాస్తుల సేకరణ సమయంలో బీమా పొందే వ్యక్తి,





నామినీ వివరాల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తు అందేలా గ్రామ, వార్డు స్థాయిలో అధికారు లు ప్రత్యేక దృష్టి సారించాలని, దరఖాస్తుల సేకరణ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఏ కుటుంబం కూడా ఈ పథకం ప్రయోజనాలకు దూరం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పథకంపై విస్తృత ప్రచారం కల్పించాలి...
ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ఉద్దేశం, ప్రయోజనాలు, దరఖాస్తు విధానం తదితర అంశాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సీఎస్ సూచించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సోషల్ మీడియా వేదికలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. గ్రామాల్లో మైక్ ప్రచారం, పోస్టర్లు, కరపత్రాలు, ప్రజా సమావేశాల ద్వారా పథకం వివరాలను ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు. గ్రామాలు, మున్సిపల్ వార్డుల స్థాయిలో నిర్వహించే ప్రత్యేక శిబిరాల వివరాలను ముందుగానే ప్రజలకు తెలియజేయాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్లు సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించి ప్రారంభోత్సవ కార్యక్రమాలు, ప్రత్యేక శిబిరాల నిర్వహణ, దరఖాస్తుల సేకరణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సీఎస్ ఆదేశించారు. పథకం అమలు తీరును క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ నర్సింగరావు, సిపిఓ పాపయ్య,ఈడియం శివ,ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సదాశివపేట అభివృద్ధికి 37 అంశాల అజెండాలకు ఆమోదం..

- వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు
- బోర్‌వెల్స్ ఏర్పాటుపై కౌన్సిల్ చర్చ

సదాశివపేట, నవంబరు 18 (జనంసాక్షి):
సదాశివపేట పట్టణ సమగ్ర అభివృద్ధి, ప్రజలకు మెరు గైన మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా నిర్వహించిన పురపాలక సంఘ సాధారణ కౌన్సిల్ సమావేశంలో మొత్తం 37 అజెండా అంశాలకు ఆమోదం లభిం చింది. ఛైర్‌పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పట్టణ అభివృద్ధి పనులు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రహదా రులు, డ్రైనేజీ తదితర అంశాలపై సభ్యులు విస్తృతంగా చర్చించారు.



పట్టణంలోని వివిధ వార్డుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు, వాటి అవసరం, ప్రాధాన్యత, అంచనా వ్యయాలను సమా వేశంలో వివరించారు. ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూర్చే పనులకు ప్రాధాన్యతనిస్తూ సంబంధిత ప్రతిపాదనలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

వేసవిలో నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు...
రాబోయే వేసవిలో ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరాపై ప్రత్యేకంగా చర్చించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో నీటి ఇబ్బందులు తలెత్తకుండా కొత్త బోర్‌వెల్స్ ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను గుర్తించాలని నిర్ణయించారు. ఇప్పటికే ఉన్న బోర్‌వెల్స్ పనితీరును సమీక్షించి, అవసరమైన చోట అదనపు నీటి వనరు లను అందుబాటులోకి తీసు కురావడంపై సభ్యులు పలు సూచనలు చేశారు.

ప్రజా సంక్షేమానికి ప్రాధా



న్యత: పట్టణంలో మౌలిక వసతులను మెరుగుపరచ డంతో పాటు భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని కౌన్సిల్ సభ్యులు అభిప్రాయపడ్డారు. ఆమోదం పొందిన పనులను ప్రణా ళికాబద్ధంగా, వేగంగా అమలు చేయాలని చర్చించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణ అభి వృద్ధి, ప్రజా సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని తెలి పారు. కౌన్సిల్ సభ్యుల సహకారంతో ఆమోదం పొందిన అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభిం చేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ముఖ్యంగా వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టి ప్రతి వార్డుకు తగినంత నీరు అందేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శివాజీ,వైస్ ఛైర్మన్ రేణుక చిరంజీవి, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

అర్హులకు చేయూత
పింఛన్ మంజూరు పత్రాల పంపిణీ



అయిజ, నవంబర్ 18 (జనంసాక్షి):
అయిజ పట్టణంలోని శ్రీకృష్ణ ఫంక్షన్ హాల్‌లో మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అలం పూర్ ఎమ్మెల్యే విజయుడు లబ్ధిదారులకు చేయూత పింఛన్ మంజూరు పత్రాలు అందజేశారు. ఒంటరి మహిళలు, వితంతు వులు, దివ్యాంగులు, చేనేత, గీత కార్మికులకు పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుజాత రాముడు, మాల నర్సింలు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

7వ వార్డులో
తాగునీటి సమస్యకు పరిష్కారం



మద్దూర్, నవంబర్ 18 (జనంసాక్షి): ప్రజా సమస్యల పరిష్కా రమే లక్ష్యంగా 7వ వార్డు అభివృద్ధికి కౌన్సిలర్ పోలీస్ శ్రీలత మహేందర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎనుముల తిరుపతి రెడ్డి సహకారంతో, మున్సిపల్ చైర్‌పర్సన్ డి.సరస్వతి జనార్దన్, కమిషనర్ శ్రీకాంత్ ఆధ్వర్యం లో గడ్డమీది గేరీ కాలనీలోని బోరుబావికి కొత్త మోటార్ ఏర్పాటు చేశారు. అలాగే గొల్ల గేరీ కాలనీలో కొత్త బోరుబావి తవ్వించి మోటార్‌ను అమర్చారు. దీంతో ఆయా కాలనీల ప్రజలకు తాగునీటి సమస్య తీరనుంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఓ. భాగ్యశ్రీ శంకర్ రెడ్డి, కౌన్సిలర్లు బి. శ్రీనివాస్, ఎం.డి. మహిమూద్, నాయకులు అశోక్ గౌడ్, ఆనంద్ కుమార్ రెడ్డి, వెంకట్, నారాయణ, వార్డు కార్యకర్తలు, ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

గ్రామ పరిపాలనకు పంచాయతీ భవనమే కేంద్ర బిందువు

- పంచాయతీ భవనం ప్రారంభించిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

కొల్చారం, నవంబర్ 18 (జనం సాక్షి):
గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రజాప్రతినిధులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం కొల్చారం మండలం తుక్కాపూర్‌లో రూ. 20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని సర్పంచ్ దొడ్ల ఆంజనేయులుతో కలిసి ప్రారంభించారు. పంచాయతీ భవనం గ్రామ పరిపాలనకు కేంద్ర బిందువుగా ఉంటుందని, ప్రజలకు సేవలు సకాలంలో అందించాలని సూచించారు.

రంగంపేట నుంచి తుక్కాపూర్ వరకు గుంతలమయమైన రహదారికి మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సర్పంచ్, పాలకవర్గ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ చారి, అధికారులు, బీఆర్ఎస్





నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.